
ఉద్దండరాయునిపాలెంలో డంప్ చేసిన ఇసుక దిబ్బలు


తాడేపల్లి మండలం గుండిమెడ దగ్గర బారులు తీరిన లారీలు


మున్నంగి దగ్గర నదిలో ఎక్స్‌కవేటర్ పెట్టిమరీ లారీల్లో ఇసుక నింపుతున్న చిత్రం

ఉచితమన్నా దోపిడీనే

- డబ్బు కొడ్తే ఇసుక సరఫరా
- చెలరేగిపోతోన్న ఇసుకాసురులు

- ప్రభుత్వ లక్ష్యానికి అక్రమార్కుల తూట్లు
- పట్టపగలే ఎక్స్‌కవేటర్లతో నదిలో తవ్వకాలు
- అక్రమాలపై కన్నెత్తి చూడని మైనింగ్, పోలీసుశాఖలు
- చామర్తి, కేవీపాలెం, అంబడిపూడి, చింతపల్లి రేవుల్లో బరితెగింపు
- ఉద్దండరాయునిపాలెంలో మాజీ ఎంపీ నందిగం అనుచరుల దోపిడి

ఇసుక.. ప్రభుత్వం ఉచితమంటోంది. సులభంగా.. రవాణా చార్జీలు భారం కాకుండా.. కొరత లేకుండా.. అందివ్వాలని కూటమి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయితే నేతల జోక్యం.. అధికారుల మౌనంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల పరిధిలో ఉచితమన్న ఊసే లేకుండా.. ప్రభుత్వ ఇసుక పాలసీని తూట్లు పొడుస్తూ.. ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. పగలు.. రాత్రి.. అన్న తేడా లేకుండా.. యంత్రాలతో ఇసుకను తోడేస్తూ తరలిస్తున్నారు. సామాన్యుల కోసమని ప్రభుత్వం పన్నులు, సీనరేజ రద్దు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించగా అది ఎక్కడా అమలు కావడంలేదు. అంతా ఉచితమే అయినా తక్కువకయినా ఇస్తున్నారా అంటే టన్నుకు రూ.600పైగా వసూలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వసూలు చేసినట్లుగానే.. కొన్ని దగ్గర్ల అయితే అంతకుమించి ఇసుకకు ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఉచిత ఇసుక అన్న మాటకు అవకాశం లేకుండా పెద్దఎత్తున దోపిడీ జరుగుతోంది. అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోకుండా అక్రమార్కులకే సహకరిస్తున్నారన్న విమర్శలు, ఆరోపణలున్నాయి. కొన్ని దగ్గర్ల అక్రమార్కులకు నేతల సహకారం పూర్తి స్థాయిలో ఉండటంతో అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు.


మున్నంగిలో ఇసుక కోసం వేసిన గాలు మార్గం

తెనాలి, గుంటూరు, గుంటూరు సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇసుకపై అస్తవ్యస్త విధానాలతో భవన నిర్మాణదారులు అల్లాడిపోయారు. పనులు లేక కూలీలు కష్టాలు పడ్డారు. ఇసుక దొరకకుండా చేశారు.. ఒకవేళ ఉన్నా భారీ ధర వెచ్చించాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రజలకు ఇసుక కష్టాలు తీర్చడంతో పాటు రవాణా చార్జీల భారం పడకుండా ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టింది. సామాన్యులకు సాధ్యమైనంత తక్కువ ధరకు ఇసుక అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి ఆదాయాన్ని కూడా ప్రభుత్వం వదులుకుంది. అయితే కాంట్రాక్టర్లు, స్థానిక నాయకులు ఇసుకను దోచేస్తున్నారు. నదిలో కూలీలతో మాత్రమే తవ్వకాలు జరపాలన్నా కాంట్రాక్టర్లు పట్టపగలే ఎక్స్‌కవేటర్లు పెట్టిమరీ ఇసుక తవ్వేస్తున్నారు. డంపింగ్ చార్జీలు లేవు కనుక తక్కువ ధరకు ఇసుక ఇస్తున్నారా అంటే అదీలేదు. గత ప్రభుత్వ హయాంలో పది చక్రాల లారీ ఇసుక సామాన్యుడికి చేరడానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించాల్సి వచ్చేది. అప్పట్లో

(మిగతా 8వ పేజీలో)

ఇసుకాసురులు.. ఇష్టారాజ్యం

- ప్రకాశం బ్యారేజి దిగువున కొల్లిపర మండలం మున్నంగి, తాడేపల్లి మండలం గుండిమెడ దగ్గర మాత్రమే ఇసుక డంపింగ్, లోడింగ్‌కు అనుమతి ఇచ్చారు. ఇక్కడ కూలీలతో నది నుంచి ఇసుక బయటకు తీసుకురావాలి. కానీ వరదతో గాలు కొట్టుకుపోయిందన్న సాకులతో ఏకంగా ఎక్స్‌కవేటర్‌నే నదిలో పెట్టి మరీ లారీలకు లోడ్ చేయించడం కాంట్రాక్టర్ల బరి తెగింపునకు నిదర్శనం.
- తెనాలిలో నిర్ణయించిన ధర ప్రకారం 20 టన్నులకు రూ.5 వేలు, 25 టన్నులకు 6,250 చొప్పున తీసుకోవాలి. టెండర్ ప్రకారం అయితే ఇంకా తక్కువే తీసుకోవాలి. గాలు మార్గం నిర్వహణ పేరుతో రెట్టింపు వసూళ్లకు దిగుతున్నారు. 10 చక్రాల లారీకి రూ.7 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అదే బిల్లు లేకుండా అయితే రూ.6 వేలు చెల్లించాల్సిన పరిస్థితి. 12 చక్రాల లారీకి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో అదనంగా పోసే ప్ర తి ఎక్స్‌కవేటర్ బొచ్చెకు రూ.750 వసూలు చేస్తున్నారు. లారీకి అదనంగా వసూలు చేసేదికాక రాత్రివేళ రూ.2,500 నుంచి రూ.5,500 వరకు వసూలు చేస్తున్నారు.
- బాపట్ల సమీపంలోని పండిళ్లపల్లి, స్టూవర్టుపురం, యాజలి, ప్రాంతాల్లో భూముల అడుగున ఇసుక పొరలను తవ్వేసి అమ్మేస్తున్నారు. ఇందుకు అనుమతి లేకపోయినా కూటమి నేతల్లో ఒకరు మావాటా మాకిచ్చి మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి, ఎవరూ అడ్డుకోరంటూ అభయం ఇస్తున్నారు.

రేవుల్లో బరితెగింపు..

- వైసీపీ హయాంలో బెజవాడ కేంద్రంగా ఉన్న జీసీకేసీ సంస్థ అచ్చంపేట మండలంలోని చామర్తి, కేవీపాలెం, అంబడిపూడి, చింతపల్లి రేవుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి పొందింది. అయితే అనుమతి ఒక చోట తీసుకుని మరో చోట తవ్వకాలు చేపట్టినట్లు మైనింగ్ శాఖ నిర్ధారించి ఆ సంస్థకు రూ.5.10 కోట్ల పెనాల్టీ విధించింది. దీనిపై ఆగస్టు 8న పల్నాడు మైనింగ్ అధికారి నాగిని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా వెనక్కి తగ్గని సంస్థ అదే రీచ్‌ల్లో పాత పద్ధతిలోనే తవ్వకాలు చేస్తున్నట్లు ఇటీవల తనిఖీల్లో విజిలెన్స్ ఎస్పీ గుర్తించారు. నదీ గర్భంలోని 9 జేసీబీ, ఎక్స్‌కవేటర్లు, మూడు లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారంటే వారి బరితెగింపు ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు.
- బాపట్ల, చీరాల ప్రాంతాలకు ఇసుక ఏటి నుంచి రావాలంటే మున్నంగి నుంచి అందాలి. ఇక్కడి నుంచి కొనుగోలు, రవాణా కలిపితే ఎక్కువ ధర పడుతుంది. దీంతో జనం భూమిలోని ఇసుకనే ఉపయోగించడానికి మొగ్గు చూపడంతో వాటి ధరలు కూడా అమాంతం పెంచేశారు. ట్రాక్టర్‌కు 5 టన్నులు పోసి రూ.3 వేలు, లారీకి 30 టన్నులు పోసి రూ.15 వేల నుంచి రూ.18 వేలు వసూలు చేస్తున్నారు. నేరుగా ఎక్స్‌కవేటర్ పెట్టి దండుకుంటున్నారు.

ఏకగ్రీవాలకు.. జై

- ఫలించిన కూటమి నేతల కసరత్తు
- జాడలేని విపక్షం.. రైతుల్లో ఏకాభిప్రాయం
- ఎట్టకేలకు తొమ్మిదేళ్ల అనంతరం ఎన్నికలు
- జిల్లాలో 106 సాగునీటి సంఘాలు ఏకగ్రీవం
- ఐదు చోట్ల నిలిచిన ఉపాధ్యక్ష ఎంపికలు
- అన్ని సంఘాల్లో కూటమి మద్దతుదారులకే పదవులు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాలను ఐదేళ్ల పాలనలో వైసీపీ పూర్తిగా పక్కన పెట్టేసింది. రైతులకు, సాగునీటి ప్రణాళికలకు ఎంతో అవసరమైన సంఘాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి ఎన్నికలకు సిద్ధమైంది. గతంలో ఊసే మరిచిన వైసీపీ నేతలు ఇప్పుడు ఎన్నికలను బహిష్కరించారు. ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి సారించినప్పటి నుంచే సాగునీటి సంఘాలను ఏకగ్రీవం చేయాలని కూటమి నేతలు కసరత్తు చేశారు. సేవా భావం కలిగిన వారిని ఎన్నుకోవాలని నేతలు రైతులకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో విపక్షం ఎన్నికలకు దూరం కాగా.. కూటమి నేతల కసరత్తుతో.. రైతుల ఏకాభిప్రాయంతో చాలావరకు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక జరిగింది. తొలుత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి వారిని క్రియాశీలకంగా మార్చడం ద్వారా తిరిగి సాగునీటి రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రాగా.. రైతులు అందుకు ఏకాభిప్రాయంతో జై కొట్టారు. ఈ క్రమంలో శనివారం తొలిఅడుగుగా వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఎన్నికలను యంత్రాంగం పూర్తి చేసింది. ఎట్టకేలకు తొమ్మిదేళ్ల అనంతరం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలతో పల్లెల్లో సందడి నెలకొంది. ఆయా సంఘాల పరిధిలో సభ్యులుగా ఉన్న రైతులంతా ఎన్నికల కేంద్రాలకు ఉదయమే తరలివచ్చారు. ఉదయం ప్రాదేశిక(టీసీ) సభ్యుల ఎంపిక జరగ్గా, మధ్యాహ్నం వాటర్ యూజర్స్ అసోసియేషన్(డబ్ల్యుయూఏ)కు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికను అధికారులు పూర్తి చేశారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను వైసీపీ బహిష్కరించడంతో ఏకగ్రీవ మయ్యాయి. నియోజకవర్గాల వారీగా కూటమి పార్టీలు ముందస్తు అవగాహనతో పదవులను కేటాయించారు. ఎన్నికలు జరుగుతున్న తీరుపై ఎప్పటికప్పుడు పార్టీ నేతలతో ఎమ్మెల్యేలు సమీక్షించారు. మొత్తంమీద నీటి సంఘాల్లో వైసీపీ మద్దతుదారుల ఉనికి లేకుండా పోయింది. కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన మద్దతుదారులు నీటి సంఘాలకు ఎన్నికయ్యారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఎన్నికల సందర్భంగా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జలవనరుల శాఖ అధికారులు ఎన్నికలను పర్యవేక్షించారు. నీటి సంఘాలు ఏర్పడిన తర్వాత మూడోసారి ఎన్నికలు జరగ్గా గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్ని సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరగడం ఇదే ప్రథమం. ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో నేతలు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యేలు, కూటమి నేతలు అభినందించారు. రైతులకు సేవలు అందించడంలో సంఘాలు కృషి చేయాలని వారు పిలుపు ఇచ్చారు.


పొన్నూరు : సాగు నీటి సంఘ ఎన్నికల విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన తహసీల్దార్ జియావుల్ హక్


ప్రత్తిపాడు : యనమదలలో ఎన్నికల కేంద్రం వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

1194 టీసీ సభ్యులు ఏకగ్రీవం

తొలుత జిల్లాలో 1242 టీసీలకు నీటిపారుదల శాఖ అధికారులు ఎన్నికలను నిర్వహించారు. వాటిలో 1194 టీసీలకు సభ్యులు ఏకగ్రీవంగా అధ్యక్షులను ఎన్నుకున్నారు. మరో 48 టీసీలలో ఎన్నికలకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వాటిని ఖాళీగా పెట్టారు. మధ్యాహ్నం నుంచి డబ్ల్యుయూఏల ఎన్నికలను నిర్వహించారు. 106 డబ్ల్యుయూఏలకు అధ్యక్షులను, 101 డబ్ల్యుయూఏలకు ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగానే ఎన్నుకున్నట్లు డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఐదు ఉపాధ్యక్షులకు మాత్రం ఎన్నిక జరగలేదు.

17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు

జిల్లాలో డబ్ల్యుయూఏల ఎన్నికల ప్రక్రియ శనివారం రాత్రికి ముగిసింది. దీంతో అధికారులు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 17న నిర్వహించాల్సిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ) ఎన్నికలపై అధికారులు, నేతలు దృష్టి సారించారు. కేడబ్ల్యూడీ పరిధిలో 21 డీసీలున్నాయి. వాటి ఎన్నికలను నిర్వహించి ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వం నిర్ణయించిన తేదీన ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

సాగర్‌లో.. విమానాశ్రయం

- ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ అధ్యయనం
- సాధ్యాసాధ్యాలపై ఈ నెల 25న నివేదిక
- ఆ తర్వాత భూసేకరణ.. కమర్షియల్ ఆపరేషన్స్

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విమానయానాన్ని ప్రోత్సహించే క్రమంలో కొత్తగా ఎయిర్‌పోర్టులను నిర్మించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లో ఒక విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) సాధ్యాసాధ్యాలపై అధ్యయనం ప్రారంభించింది. మరో 10 రోజుల్లో(ఈ నెల 25వ తేదీ లోపు) ఈ అధ్యయన నివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందనుంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్రానికి చెందిన ఎంపీ కావడం, ఆయనతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ నేతలకు ఉన్న సత్సంబంధాల దృష్ట్యా సాగర్‌లో కమర్షియల్ ఆపరేషన్స్‌తో ఒక విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నాగార్జునసాగర్ రాష్ట్రంలో ఒక పర్యాటక ప్రాంతంగా ఉన్నది. ఏటా నాగార్జునకొండని సందర్శించేందుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. అయితే ప్రస్తుతం వారంతా రోడ్డు మార్గంలోనే ఇక్కడికి వస్తున్నారు. ఒక ఎయిర్‌స్ట్రిప్ ఉన్నప్పటికీ ఇది ప్రైవేట్ జెట్‌ల కోసమే వినియోగిస్తున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడ ఒక విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని తలపోసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. కాగా కూటమి ప్రభుత్వం ప్రతీ జిల్లాలో ఒక విమానాశ్రయం ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నది. తద్వారా రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందన్న నమ్మకంతో ఉన్నది. కలెక్టర్ల సదస్సులోనూ ఈ విషయాన్ని నొక్కి చెప్పింది. అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పటికీ సరైన రవాణా, వసతి సౌకర్యాలు లేకపోవడం వల్ల పర్యాటకులను ఆకర్షించలేకపోతున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే సీ ప్లేన్ సర్వీసుని విజయవాడ వైపున ప్రకాశం బ్యారేజ్ నుంచి ప్రారంభించారు. సీప్లేన్/వాటర్‌డ్రోమ్స్ సర్వీసులను అమరావతి రాజధానికి ఉన్న వాటర్‌ఫ్రంట్ వైపు నుంచి కూడా ప్రారంభించవచ్చు. అలానే సాగర్‌లోనూ ఈ సదుపాయం ఏర్పాటుకు అవకాశాలున్నాయి. వాటర్‌డ్రోమ్ ఏర్పాటుకు ఫీజిబిలిటీ రిపోర్టుని ఈ నెల 20 లోపు ఇవ్వాలని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా నాగార్జునసాగర్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తే కమర్షియల్ ఆపరేషన్స్‌కి డిమాండ్ లభ్యమయ్యే అవకాశం ఉన్నది. పర్యాటకంతో పాటు సిమెంటు, సున్నపురాయి పరిశ్రమలకు ఆ ప్రాంతం ఖిల్లాగా ఉన్నది. దీని దృష్ట్యా విమానయానానికి డిమాండ్ కచ్చితంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.



వేర్వేరు కేసుల్లో 1.5 కేజీల గంజాయి స్వాధీనం

- ఏడుగురు అరెస్టు
- 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

6

రేపు కోటప్పకొండలో ఆరుద్రోత్సవం

- విశేష అభిషేకాలకు విస్తృత ఏర్పాట్లు
- తరలిరానున్న మేధాదక్షిణామూర్తి మాలధారణ స్వాములు

8

అమరావతి నుంచి హైవేకి రోడ్ల అనుసంధానం

రాజధాని రైతుల కేసులు పరిష్కారం

వర్సిటీలో.. సర్టిఫికేట్లు

- నాగార్జున విశ్వవిద్యాలయంలో కలకలం
- డిగ్రీ కోర్సుల నకిలీ ధ్రువీకరణపత్రాల గుర్తింపు
- పీజీ స్పాట్ అడ్మిషన్లలో వెలుగు చూసిన నకిలీలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నాలుగు రోజులుగా మౌనం
- పోలీసులకు ఫిర్యాదుపైనా పట్టించుకోని వర్సిటీ ఉన్నతాధికారులు

పెదకాకాని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జునుడి పేరుతో వెలిసిన విద్యాలయం.. రాజధాని అమరావతి పరిధిలో ప్రధాన వర్సిటీ.. అలాంటి విద్యా కేంద్రంపై గతంలో ఎన్నో ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. కానీ విద్యార్హత ధ్రువపత్రాలే నకిలీలు జారీ చేయడం.. ఆ విషయం తెలిసీ మౌనం వహించడంతో వర్సిటీ ఉన్నతాధికారుల పాత్రపై అనుమానాలు వస్తున్నాయి. నాగార్జున విశ్వవిద్యాలయ పీజీ స్పాట్ అడ్మిషన్లలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగు చూసింది. నాలుగు రోజులుగా వర్సిటీలో కలకలం సృష్టిస్తున్న ఘటనకు సంబంధించిన వివరాలు.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయలంలో పది రోజుల క్రితం పీజీ కోర్సుల ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్‌ను ఉన్నతాధికారులు నిర్వహించారు. అడ్మిషన్ల డైరెక్టర్ బ్రహ్మాజీరావు ఆధ్వర్యంలో స్పాట్ అడ్మిషన్లు జరిగాయి. కాగా కొందరు విద్యార్థులు గతంలో వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో డిగ్రీ చదివినట్లు సర్టిఫికెట్లను కౌన్సెలింగ్‌లో అందజేశారు. వర్సిటీ దూరవిద్యా కేంద్రంలో చదివినట్లుగా అనేకమంది విద్యార్థులు కూడా తమ విద్యార్హత ధ్రువపత్రాలను అందజేశారు. ఈ క్రమంలో రెగ్యులర్ డిగ్రీ చదివిన నలుగురువి, దూరవిద్యా ద్వారా డిగ్రీ చదివిన ఐదుగురు విద్యార్థులకు చెందిన సర్టిఫికెట్లు నకిలీవిగా అడ్మిషన్ కేంద్రంలోని ఉద్యోగులు నాలుగు రోజుల క్రితం గుర్తించారు. అనంతరం వర్సిటీ సర్వర్‌లో పరిశీలించినా ఆ తొమ్మిది మంది సరిఫికెట్లు లేవు. ఈ ఏడాది జూన్‌లో ఈ సర్టిఫికెట్లు వర్సిటీ నుంచి జారీ అయినట్లుగా ఉంది. అప్పుడు ఏ అధికారులైతే పరీక్షల విభాగంలో ఉన్నారో ఆ అధికారులే సర్టిఫికెట్లు ఇచ్చినట్లుగా వారి సంతకాలు ధ్రువపత్రాలపై ఉన్నాయి. వెరిఫికేషన్‌లో ఆ సర్టిఫికెట్లు నకిలీవి అని తేలడంతో వర్సిటీ ఉద్యోగులు కంగుతిన్నారు. అనంతరం ఉద్యోగులు వర్సిటీ ఉన్నతాధికారులకు ఈ నకిలీ సర్టిఫికెట్ల సమాచారాన్ని తెలిపారు. ఈ సర్టిఫికెట్లపై పోలీసులకు ఫిర్యాదు చేద్దామని ఓ అధికారి నేరుగా వర్సిటీ ఉన్నతా ధికారికి చెప్పి నాలుగు రోజులవుతున్నది. కొందరు ఉన్నతాధికారులకు తెలిసే నకిలీల వ్యవహారం జరిగిందని అందువల్లే వారు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల సంతకాలు కూడా ఆ ధ్రువపత్రాలపై ఉన్నందునే వారు చర్యలకు, పోలీసులకు ఫిర్యాదుకు వెనుకడుగు వేస్తున్నారని సమాచారం.



జమిలీ ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి ముప్పు



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు, పక్కన పాశం రామారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశంలో జమిలీ ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని పీఎల్‌రావు భవన్‌లో శనివారం సీపీఎం 25వ జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలీ ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక ఒకే పార్టీ పేరుతో రాజకీయంగా లబ్ధి పొందడానికి బీజేపీ చేస్తున్న కుట్రలో ప్రాంతీయ పార్టీలు కూడా చిక్కుకుంటున్నాయని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు కమ్యూనిస్టులు, లౌకిక వాదులు ఐక్యం కావాలన్నారు. అల్లు అర్జున్ అరెస్టుపై స్పందించిన రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, సినీ నటులు మణిపూర్‌లో జరిగిన అల్లర్లపై ఎందుకు స్పందించలేదన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ అదానితో జగన్ ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందంపై హైకోర్టులో కేసు దాఖలు చేసిన ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఇప్పుడే అదే ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయకుండా ఎందుకు కొనసాగిస్తుందో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, కల్తీ పురుగు మందులకు జిల్లా అడ్డాగా మారినప్పటికీ, వారిపై తీసుకుంటున్న చర్యలు శూన్యమని విమర్శించారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు సక్రమంగా లేదన్నారు. రాజధాని అమరావతిలో ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సభకు జిల్లా నాయకులు కె.నళినీకాంత్, ఎస్.ఎస్ చెంగయ్య, ఎల్.అరుణ అధ్యక్షులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాశం రామారావు, వై.నేతాజి, ఈమని అప్పారావు, ఎం.రవి, భావన్నారాయణ, ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

MACHERLA MUNICIPALITY

'e' - Procurement Tender Notice

Roc.No.250/2019/E1, Dt: 13-12-2024

NIT. No.1/2024-25 to 7/2024-25(Seven Works Only)
BPS Scheme - Rs.27.77 Lakhs

Further details can be seen at 'e' procurement Market place in www.apeprocurment.gov.in officer inviting bids Commissioner, Macherla Municipality, Macherla, Andhra Pradesh.
Ph: 9849905838

Sd/- COMMISSIONER, MACHERLA MUNICIPALITY

వేర్వేరు కేసుల్లో 1.5 కేజీల గంజాయి స్వాధీనం

- ఏడుగురు అరెస్టు
- 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన గుంటూరు వన్ టౌన్ సీఐ లత, సిబ్బంది

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని రోడ్డులోని వాసవి నగర్ వద్ద 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు శనివారం గుంటూరు వన్ టౌన్ ఎక్సైజ్ సీఐ బి.లతా తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి సమీపంలోని లింగాపురం గ్రామానికి చెందిన వేమవరపు ప్రేమ్ కుమార్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ప్రాంతానికి వెళ్లి గంజాయి తీసుకొచ్చాడు. నగరంలోని స్నేహితులైన పరమాయకుంట వద్ద గల అరుంధతి నగర్‌కు చెందిన గున్నం యశ్వంత్ సాయిరాం, మంగళదాస్ నగర్ సమీపంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన గొట్టిముక్కల సుమంత్ కలిసి గంజాయిని అమ్మేందుకు చిన్న చిన్న పొట్లాలుగా కట్టారు. వాసవి నగర్ చివరలోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ వద్ద గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 600 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు మహమ్మద్ కాశీం షరీఫ్, సిబ్బంది బసవేశ్వరరావు, పూర్ణచంద్రరావు, సంధ్య మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాల మేరకు.. గంజాయి విషయంలో మంగళగిరి నియోజకవర్గమంతా నిఘా పెట్టారు. దుగ్గిరాల గ్రామ శివారులోని ఈమని లాకుల వద్ద అనుమానాస్పదస్థితిలో ముగ్గురు యువకులు సంచరిస్తున్నారనే సమాచారంతో వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 550 గ్రాముల గంజాయితో ఉన్న పాలిథిన్ కవరును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రావూరి హర్షవర్ధన్ అరకు సమీపంలోని పాడేరు నుంచి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నాడు. ఈక్రమంలో పరిచయమైన చిలువూరుకు చెందిన బండ్లమూడి వినయ్, కనపర్తి కిరణ్‌కుమార్ కూడా హర్షవర్ధన్‌తోపాటు గంజాయి విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ 50 గ్రాముల బరువు ఉంటుంది. ప్యాకెట్టును రూ.600కు విక్రయిస్తున్నారు. జేబులో పెట్టుకునేంత చిన్నపరిమాణంలో ఉండే ఎలక్ట్రానిక్ తూనికను గంజాయి బ్యాచ్ వినియోగిస్తున్నారు. పోలీసులే గంజాయి కొనుగోలుదారులుగా వెళ్లి విక్రయిస్తున్న యువకులను పట్టుకున్నారు. సమావేశంలో ఎస్సై వెంకటరవి పాల్గొన్నారు.

నరసరావుపేటలో..



అరెస్టు చేసిన నిందితుడితో పోలీసులు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు మొదటి పట్టణ సీఐ శనివారం తెలిపారు. పట్టణ మొదటి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి 9 గంటలకు నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుని వద్ద నుంచి 350 గ్రాముల గంజాయి, స్కూటీ, గతంలో వివిధ చోట్ల చోరీ చేసిన మరో ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం సొత్తు విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు. నిందితుడిని కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు : పాప మృతి



మృతి చెందిన ఆరాధ్య

ఈపూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో పసి పాప మృతి చెందగా మరో నలుగురు గాయపడిన సంఘటన కూచినపల్లి సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వినుకొండ మండలం చాత్రగడ్డపాడుకు చెందిన ఆళ్ల బ్రహ్మారెడ్డి తన కుటుంబంతో కలిసి హైదరాబాద్ నుంచి కారులో వస్తున్నాడు. వినుకొండ నుంచి కారంపూడి వెళ్తున్న కారు కూచినపల్లి సాయిబాబా గుడి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తాపస ఆరాధ్య(2) మృతి చెందగా, ఆళ్ల లక్ష్మీదుర్గా, విశృతరెడ్డి, బ్రహ్మారెడ్డి, ప్రవళికకు గాయాలైయ్యాయి. రెండు కారులు నుజ్జునుజ్జు అయ్యాయి. క్షతగాత్రులను ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి వినుకొండకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికల్లో ఘర్షణ



చికిత్స పొందుతున్న మేదరమెట్ల అనిల్

నూజెండ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు గ్రామంలో సాగునీటి సంఘాల ఎన్నికల విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు ఘర్షణకు దారి తీశాయి. ఈ ఘర్షణలో ఉప సర్పంచి మేదరమెట్ల అనిల్, ఎండ్లూరి బాపనయ్య, గంగినేని శ్రీనివాసరావులకు గాయాలైయ్యాయి. వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎండ్లూరి మల్లికార్జున, ఎండ్లూరి శివాజీ, గంగినేని నరేంద్ర, ద్రోణాదుల నరేంద్ర, మేదరమెట్ల నాగేశ్వరరావు తమపై దాడి చేసినట్లు బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాగునీటి ఎన్నికల సందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని 12 టీసీలు ఉండగా ఒక వర్గం వారికి ఐదు, మరో వర్గం వారికి ఏడు టీసీలు ఇచ్చే విధంగా నాయకులు ఒప్పందం చేసుకున్నారు. కాగా ఎన్నికల జరుగుతున్న సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద తొమ్మిదో నంబరు టీసీకి బోడపాటి చిన వెంకటరావు నామినేషన్ వేయగా, మరో వర్గానికి చెందిన వారు నామినేషన్ వేయటానికి రావటంతో వాగ్వాదం మొదలైంది. ఒంటి గంటకు ఎన్నికలను పూర్తి చేసిన అనంతరం కొందరు పోలింగ్ కేంద్రంలోకి వచ్చి పోలింగ్ సిబ్బంది వద్ద ఉన్న పత్రాలను తీసుకోవటంతో అభ్యంతరం తెలిపిన వారిపై ప్రత్యర్థులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ బీవీ కృష్ణారావు గ్రామానికి వెళ్లి ఘర్షణను నివారించారు.



ఉద్యోగావకాశాలు

→ **WANTED TEACHERS:** Mathematics/ Computers/ Mother teachers/ Care-takers. Send resume through whatsapp to 9440644248. Kanna Schools, Guntur : Railpet, Vallurivari thota, RTC Colony, Gunturu vari thota, Old Guntur.
KC-946

→ **Hiring Alert Speaking professionals** required for a taxation company. Salary : 12,000 + incentives, Night shift : 10 PM to 7 AM. Contact: 7075006967.
AJG-203745

→ **WANTED TEACHERS: PHYSICS** & HINDI, 6th TO 10th, SIDDHARTHA SCHOOL, VENKATA KRISHNA PURAM, Ph. No:- 9948345126.
AJG-203775

→ గుంటూరు, లక్ష్మీపురంలోని ప్రముఖ సెలూన్ షోరూంలో పనిచేయుటకు అనుభవం గల మరియు బిగినర్ Hair Dressers & బ్యూటీషియన్స్ కావలెను. Ph : 99901 77222.
AJG-210095

→ ప్రముఖ సె॥ సంస్థ నందు పనిచేయుటకు గుంటూరు లోకల్ వాళ్ళు మాత్రమే అర్జెంటుగా సె॥ గార్డ్ / ASO / SO కావలెను. డ్యూటీ : 12 గం॥, చదువు : 10 / ఇంటర్ / డిగ్రీ, Age : 20 To 52. Ph : 85640 79999.
AAA-9845

→ ప్రముఖ MNC కంపెనీలో పనిచేయుటకు స్త్రీ/పు అభ్యర్థులు కావలెను. విద్యార్హత, వయస్సుతో పనిలేదు. మంచి ఆదాయం పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు సంప్ర॥ 94940 90415, 98661 32744.
NAM-316

→ టైటానిక్ శారీస్ & రెడీమేడ్ షోరూంలోకి సూపర్‌వైజర్, సేల్స్‌మెన్స్, హెల్పర్స్ కావలెను. జీతం : 10,000/-ల నుండి 20,000/- ల వరకు. జిన్నా టవర్ సెంటర్ దగ్గర, గుంటూరు. 0863-2210927
SSD-1369

→ ప్రముఖ ఆఫీసు నందు ఆఫీసు అసిస్టెంట్‌గా వర్క్ చేయుటకు Driving తెలిసిన వివాహిత స్త్రీలు (Two Wheeler) కావలెను. విద్యార్హత:- 10th పాస్, ✆ 90309 93893
AJB-1069

అమ్మకము

→ పిడుగురాళ్ళ మెయిన్ రోడ్, చెన్నయ్ షాపింగ్‌మాల్ ప్రక్కన 63 గజాల్లో కట్టుబడి చేసిన 2 షాపులు అమ్మబడును. అద్దె 20K వస్తుంది. సంప్ర॥ 9985028515.
AJG-203453

→ గుంటూరు, గోరంట్లలో 65 గజాల్లో కట్టిన కొత్త బిల్డింగ్ అమ్మబడును, నార్త్ వెస్ట్ ఫేస్, క్రింద 2 షాప్స్, పైన ఇల్లు, 100% వాస్తు, 25K అద్దె వస్తుంది, 66L సంప్ర॥ 99087 34363.
AJG-204001

→ గుంటూరు సిటీ, అంకిరెడ్డిపాలెం, NH-16 & ఇన్నర్ రింగ్‌రోడ్, జంక్షన్ హైవే గార్డెన్స్‌లో గజం 16500, హౌసింగ్ బోర్డు ఎక్స్‌టెన్షన్ కొత్తహౌస్ 50ల, అగతవరప్పాడు 3 ఫ్లోర్స్ హౌస్ 75ల. సంప్ర॥ 99669 60009.
AJG-203700

రియల్ ఎస్టేట్

→ అమరావతి రోడ్ నగరాలు 110 గ. స్థలం 45 వేలు, 101 గ ఇల్లు 80 లక్షలు, 100 గ. ఇల్లు 75 లక్షలు, 200 గ స్థలం 32 వేలు, సంప్ర॥ 90308 07472.
AAA-9844

→ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా, మరెక్కడైన అ॥కొ॥ జనచైతన్య మా ప్రత్యేకత. సంప్ర॥ 73823 96677.
AA-45

బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్

→ మీ సొంత స్థలంలో మీకు నచ్చిన విధంగా చదరపు అడుగు రేట ప్రకారం తీసుకొని పూర్తి కాంట్రాక్ట్ పద్ధతిలో గవర్నమెంట్ ఉద్యోగులకు మరియు ఐటీ వ్యాపారులకు అన్ని రకాల కన్‌స్ట్రక్షన్స్ చేయబడును. వివరాలకు గుంటూరు. సెల్ : 93907 0547.
RK-1893

PLOT FOR SALE

→ గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి అంకిరెడ్డిపాలెం, బుడంపాడులో అన్ని వసతులతో అతి తక్కువ ధరకే స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కలవు. సంప్ర॥ 99591 27008.
AJG-204003

→ 450 ఎకరాల వెంచర్ నందు 11 సెంట్లు భూమి కేవలం రూ. 5,00,000/- మాత్రమే. స్పాట్ రి. అవకాడో ఫ్రూట్ పై ప్రతి సం.లక్షల్లో ఆదాయం. గుంటూరు నుండి గంట ప్రయాణం. సంప్ర॥ 83175 28192.
AAA-9637

→ గుంటూరు నుంచి తెనాలి రోడ్డులో ఉన్న విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రక్కన చ.గ 8000 మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర॥ 8247306162.
AJG-204004

→ తాడికొండ (మం) కంతెరు గ్రామం స.నెం. 467/A3ఎ సాయి రిషిక ప్యారడైజ్ లోని LP No. 72/2019 (CRDA Appro Ved) కంతెరు To తాడికొండ మెయిన్ రోడ్ దగ్గర శ్రీసిటి వెంచర్ ఎదురు ప్లాటు నెం. 137, 138లలో 200 చ॥గ॥లు 50X36 అ॥లు పడమర ఫేస్ అమ్మబడును. సంప్ర॥ 7675995891
AJO-211154

ఇల్లు అమ్మకము

→ బాపట్ల జిల్లా, కర్లపాలెం మండలంలోని ప్రవీణ్ హాస్పిటల్ ప్రక్కన 5 సెంట్లలో ఉన్న 25X36 కొలతలుగల మూడు అంతస్తుల బిల్డింగ్ అమ్మకమునకు కలదు. సెల్: 9949504196.
AJO-190385

ఇల్లు అమ్మకం

→ **30X55, 184 గజములు, ఉత్తరం ఫేస్,** 2 బిల్డింగ్‌లు కల్గిన స్థలం, అమ్మకానికి కలదు. (హాస్పిటల్, స్కూల్, హాస్టల్‌కి అనుకూలం) ప్రస్తుతం 5 కాపురాలు నివాసం ఉన్నారు. గుంటూరు, కొత్తపేట శివాలయం ఎదురు వీధి, 12-14-7, రాఘవేంద్ర హాస్పిటల్ దగ్గర, సంప్ర॥ 99855 11611.
AJG-191843

బిల్డింగ్ అమ్మకము

→ తెనాలి మండలం, సంగం జాగర్లమూడిలో 154 గజాలలో గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న కొత్త బిల్డింగు అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9949619655, 9292453773.
AJG-203043

FLAT FOR SALE

→ బృందావన్ గార్డెన్స్, 4వ లైను, శ్రీనివాసం అపార్ట్‌మెంట్‌లో గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 3BHK (2295 Sft) డీలక్స్, లగ్జరీ ఫ్లాట్ అమ్మకానికి కలవు. సంప్ర॥ 9493445666.
AA-66

→ అమరావతిరోడ్డు BVR కన్వెన్షన్ ఎదురు ప్రశాంతి నగర్, 2వ లైను నందు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 3BHK (1818 Sft) లగ్జరీ ఫ్లాట్ ముకుంద రెసిడెన్సి నందు అమ్మకం. సంప్ర॥ 9493445666.
AA-67

→ ఓం శ్రీం వర్షిక నివాస్, ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే గేటు దగ్గర, అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ అతి తక్కువ ధరకే అమ్మకమునకు కలదు. 70936 09070.
AAA-9846

→ గుంటూరు, సిద్ధార్థ నగర్ 1/2, స్కేటింగ్ గ్రౌండ్, Opp. KLP School, శ్రావణ్ ఎన్క్లేవ్ Ready to Move 3BHK 2050 Sft. ఫుల్ ఫినిష్డ్ & సెంట్రల్ A.C, సంప్ర॥ 88973 93868, 90001 83217.
RK-1849

→ తాడేపల్లిలో ఫ్లోర్‌కి 2 ఫ్లాట్స్ చొప్పున నిర్మించిన 3 BHK & 4 BHK (4272 Sft.) లగ్జరీ ఫ్లాట్స్ ఈస్ట్/ వెస్ట్ ఫేసింగ్ 2 కార్‌పార్కింగ్‌తో అమ్మబడును. ✆ 92464 95388
AJB-389

→ గుంటూరు, ఇన్నర్‌రింగ్ రోడ్డు, భగత్‌సింగ్ బొమ్మ దగ్గరలో రెడీ టూ ఆక్యుపై 3BHK 2300 Sft. డ్యూప్లెక్స్ 2BHK 1150 Sft. ఫుల్లీ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ అమ్మకం. సంప్ర॥ 9490960449.
AA-39

→ వర్షిక నివాస్, ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే గేటు దగ్గర, అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2 BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ 42 లక్షలకే. సంప్ర॥ 9848110543, 8885566086
AJV-4390

అద్దెకు

→ గుంటూరు సిటీలోని బృందావన్ గార్డెన్ 2BHK పోర్షన్ ఇండిపెండెంట్ హౌస్ నందు అద్దెకు కలదు. హిందూవులకు మాత్రమే. సంప్ర॥ 9985251888.
AJG-204006

→ గుంటూరు G.T. రోడ్డు రమేష్ హాస్పిటల్ వెనుక 26,500 చ.అ. కమర్షియల్ 5 అంతస్తుల భవనం సెల్లార్, లిఫ్ట్ సౌకర్యంతో హాస్పిటల్స్‌కి, ఆఫీసులకు, హోటల్స్‌కి, స్కూల్స్‌కి, కాలేజీలకు బిల్డింగ్ అద్దెకు కలదు. సంప్ర॥ 98661 32826, 9441121025.
AJG-203743

కమర్షియల్

→ షోరూం / షాపుకి అద్దెకు : తూర్పు దిక్కు గల గ్రౌండ్ ఫ్లోర్ - 800 Sft & 1వ ఫ్లోర్ - 800Sft కలిపి ఇవ్వబడును. లాలాపేట, చందన బ్రదర్స్ ప్రక్కన. గుంటూరు. ఫోన్ : 99481 97803.
AJG-204005

→ సినిమాహాలు అద్దెకు : వెంకటేశ్వర థియేటర్ 70MM Lazer Projector, Box A/c, క్యాంటీన్‌తో సహా అద్దెకు యివ్వబడును. Cell No : 9848144780, చిలకలూరిపేట.
AJG-203231

→ విజయవాడ, కనకదుర్గవారధి నుండి 6km, ప్రకాశం బ్యారేజ్ నుండి 4km, AIIMS హాస్పిటల్ నుండి 3km మంగళగిరి NRI నుండి 4km దూరంలో ఓల్డ్ GNT రోడ్, మెయిన్ రోడ్డు ప్రక్క, 1 ఎకరం స్థలంలో 12,000 sft గోడౌన్ sft రూ.20/- లెక్క అద్దె కొరకు సంప్ర: 92908 05154, 83099 04493.
AJB-715

లీకేజీ సమస్యలా?

→ బాత్ రూమ్ లీకేజి గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్ క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజీపైనైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్ర॥ 9642458892
AJG-203733

చెదల నివారణ

→ చెదపురుగులు, బొద్దింకల నివారణ 5 సం॥ గ్యారంటీ. AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ లాన్సర్ పెస్ట్ కంట్రోల్, పట్నం బజారు, గుంటూరు. ఫోన్ : 8978672824, 9848131213
AA-46

బిల్డింగ్ డిమాలిష్

→ పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగుల గొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. సంప్ర॥ 97032 90782, 9700442419
AA-47

EDUCATION

→ లాంగ్ టర్మ్ కోచింగ్ ఫర్ EAPCET-2025 (AP&TS), అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యాబోధన. హాస్టల్ వసతి కలదు. ఇంటర్ ట్యూషన్స్ చెప్పబడును. శ్రీ దివ్య ఇన్‌స్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 73967 55801.
NAM-308

KENNELS

→ **KENNELS:** అన్ని రకముల డాగ్స్‌కు ట్రైనింగ్ ఇవ్వబడును. మీ ఇంటి వద్దకే వచ్చి వాక్సిన్ వేయబడును మరియు డీ వార్మింగ్ చేయబడును. డాగ్ కేర్ సెంటర్, గుంటూరు. డాగ్ ట్రైనర్. సంప్ర॥ 63046 97173.
AJG-203774

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అట్టహాసంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల జన్మదిన వేడుకలు



నరేంద్ర కుమార్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

పొన్నూరు టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచే చింతలపూడిలోని ఎమ్మెల్యే గృహం కోలాహలంగా మారింది. భారీ సంఖ్యలో చేరుకున్న కార్యకర్తలు బాణసంచా పేల్చి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఎమ్మెల్యే గృహానికి వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పంచాయతీరాజ్ డీఈఈ ఎంఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఇంజనీరింగ్ అధికారులు తరలివెళ్లి నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులను గజమాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు చెందిన అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందించారు.

వివిధ విభాగాల అధికారులు..

సంగం డెయిరీ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, పట్టణంలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆటో నగర్ అసోసియేషన్ నాయకులు, పండ్ల వర్తక సంఘం నాయకులు, ముస్లిం మైనార్టీలు, ఎస్సీసెల్ నాయకులు, పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నరేంద్రకుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు.

అన్నదానం

రవి ఫీ స్వీట్ హోమ్ అధినేత సయ్యద్ బాజీ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ద్వారా 800 మందికి అన్నదానం చేశారు. ఇందిరా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు.

విద్యార్థులు కుతూహలంతో చదువుకోవాలి

- కలలు కనేవారి కోసం ప్రపంచం స్వాగతం పలుకుతూనే ఉంటుంది
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యం కుతూహలంతో, వినయంతో ఉండి చదువుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కలలుకనే వారి కోసం ప్రపంచం ఎప్పుడూ స్వాగతం పలుకుతూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ కిస్మత్‌పురాలోని ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ 11వ గ్రాడ్యుయేషన్ డే శనివారం జరిగింది. కార్యక్రమానికి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఈరోజు కేవలం ఒక మైలురాయి మాత్రమే కాదని, వృత్తిపరమైన ప్రయాణాల్లో కీలకమైన క్షణమని చెప్పారు. ప్రపంచంలో చాలా తక్కువ మంది మాత్రమే తమ ప్రతిభను అందరికీ ఉపయోగపడేలా రూపకల్పన చేస్తారని, అలాంటి డాక్టర్ గుల్లపల్లి నాగేశ్వరరావు ఉద్వేగభరితమైన కల నుంచి ఈ సంస్థ ఆవిర్భవించిందన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ లేకపోయి ఉంటే.. దేశంలో ఇంత గొప్ప ఎడ్యుకేషన్ నుంచి గ్రాడ్యుయేషన్ పొందే అవకాశం మీకు దక్కేది కాదన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తికావడంతో మీకు జీవితంలో కొత్త కెరియర్ ప్రారంభం కావడంతోపాటు కొత్త సవాళ్లు కూడా మొదలవుతాయని, ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కొనేందుకు, సమాధానం ఇచ్చేందుకు సహనం, ఓర్పుతో వ్యవహరించాలని సూచించారు. గ్రాడ్యుయేషన్ చదువుకు ఎండ్‌పాయింట్ కాకుండా, ఇక్కడి నుంచి మీరు ప్రతిరోజూ ఏదో ఒక విషయాన్ని నేర్చుకుంటూ నిత్య విద్యార్థిలా ఉండాలన్నారు. తాను కూడా చిన్న మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన వాడినేనని, 25 ఏళ్ల క్రితం మీలాగే ఇలాంటి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఎన్నో ఆశలతో కూర్చున్నానని చెప్పారు. ఆ సమయంలో చదువుకునేందుకు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. ప్రతి సవాలుకు పరిష్కారం ఉంటుందని, అందుకే విద్యార్థులు ప్రతినిత్యం కుతూహలంగా ఉండాలన్నారు. కార్యక్రమం అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సర్టిఫికెట్లు అందజేశారు.

లోక్ అదాలత్‌లో 2759 కేసులు పరిష్కారం

గుంటూరు (లీగల్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారధి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడపటి సమాచారం మేరకు 2759 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. ఇంకా కొన్ని కోర్టులలో కేసులను న్యాయమూర్తులు పరిష్కరిస్తూ ఉన్నారు. సివిల్ కేసులు 258, క్రిమినల్ 1898, చెక్ బౌన్స్ కేసులు 194, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 150, కార్మిక వివాదాలు 7, వివాహ సంబంధ కేసులు 64, బ్యాంకు కేసులు 56తోపాటు 129 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా రూ.47 కోట్ల 13 లక్షల 11 వేల 302ల మేరకు కక్షి దారులకు లబ్ధి చేకూరిందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. లీలావతి తెలిపారు. ఫిజికల్, వర్చ్యువల్ పద్ధతిలో నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావటానికి సహకరించిన న్యాయవాదులకు, పోలీస్ సిబ్బందికి, ప్రభుత్వ సంస్థలకు కక్షిదారులకు, న్యాయస్థాన సిబ్బందికి, న్యాయ సేవాధికార సంస్థ తరుపున ఆమె ధన్యవాదాలు తెలిపారు.

దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు.. సమయ పాలన పాటించాలి

రేపల్లె, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): దూరప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ సర్వీస్‌లు కార్మికుల పనితనంతో సమయపాలన పాటించే విధంగా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు అన్నారు. శనివారం రేపల్లె ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె ప్రాంతం నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్మికులు ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడిపే విధంగా కృషి చేయాలని సూచించారు. సమయపాలన మాసోత్సవాలు ఒక నెల కాదనీ, అది నిరంతర ప్రక్రియ అని ఆర్టీసీ కుటుంబ సభ్యులు తెలుసుకోవాలన్నారు. తీరప్రాంతంలోని రేపల్లె డిపో ఆర్థికంగా బల పడే విధంగా అన్ని సంఘాల నాయకులు, కార్మికులు పని చేయాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటారు. కార్యక్రమంలో గుంటూరు డీపీటీవో ఎం.రవికాంత్, ఇన్‌చార్జి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అన్ని యూనియన్ల అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచార కేసులో నిందితులు అరెస్టు

కొల్లూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన నిందితులను డీఎస్పీ శ్రీనివాసరావు అరెస్టు చేసినట్లు శనివారం ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 26న కొల్లూరు మండలానికి చెందిన ఓ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ఆవులవారిపాలెం క్రీస్తులంకకు చెందిన ముద్దాయిలు విప్పర్ల ప్రేమ్‌కుమార్ అలియాస్ విక్కీ, బెజ్జం శ్యాంకుమార్ ఉరఫ్ శ్యాంబాబు కొల్లూరు కరకట్ట వద్ద ఉన్న బస్టాప్‌లో ఉన్నట్లు శుక్రవారం రాత్రి సమాచారం అందడంతో డీఎస్పీ, వేమూరు సీఐ వీరాంజనేయులు, ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బందితో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీన పరుచుకున్నారు. నిందితులను శనివారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

నేడు ఐస్ స్కేటింగ్ పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఐస్ స్కేటింగ్ దినోత్సవంను పురస్కరించుకుని స్థానిక బీఆర్ స్టేడియంలో ఆదివారం ఐస్ స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి షేక్ ఖాజా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-10, 10-13, 13-15, 15-17, 17-19, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలలో బాలబాలికలు, పురుషులు, మహిళలు పాల్గొన వచ్చని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనే ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

ఆరు నెలల్లోనే అద్భుతమైన ప్రగతి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే అద్భుతమైన ప్రగతిని సాధించిందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) చైర్మన్ మన్నవ మోహన కృష్ణ కొనియాడారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మోహనకృష్ణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అధోగతి పాలైన ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి బాట పట్టించ డానికి ఆరునెలలుగా సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారని కొనియాడారు.

పరవశింపజేసిన 'భజరే గోపాలం'

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): భజరే గోపాలం నామసంకీర్తన ప్రేక్షకులను పరవశింపజేసింది. మెరైన్ ఇంజనీర్ లింగం చంద్రశేఖర్, గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. చెన్నైకి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, నాదోపాసకులు శ్రీరామపాద భాగవతార్, రమా శ్రీరామ్, గోకుల్ కృష్ణ, విక్రమ్, హరిహరన్‌లు తమ గాత్ర ధారణలో వాగ్గేయకారుల సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. శ్రీరామపాదకు, శ్రీమతి గాత్ర సహకారం అందించగా, హార్మోనియంపై రాజారాం, మృదంగం గోపాల్, డోలక్ సాకేత్‌రామ్ చక్కటి వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా నామసంకీర్తన కళాకారులను ఆలయ పాలక వర్గం, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

16 నుంచి శ్రీరామ కోటి మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్‌లోని శ్రీరామనామ క్షేత్రంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు నిర్వ హించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 16న అంకురారోపణ, అఖండజ్యోతి, 17న శ్రీరామకోటి తులసి సహస్రనామార్చనలు, 18న సీతారామ కల్యాణ మహోత్సవం, 19న సహస్ర నాగవల్లీ దళార్చన, 20న రామ సామ్రాజ్య పట్టాభిషేకం, 21న తెప్పతిరునాళ్ల జరుగుతాయని వివరించారు.



ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్‌ను కలిసిన చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్ పర్సన్ హేమలత

మర్యాదపూర్వక కలయిక

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) చైర్మన్ దేగల ప్రభాకర్‌ను చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్ పర్సన్ కటారి హేమలత మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయానికి శని వారం ఆమె వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారిద్దరూ సుదీర్ఘంగా చర్చించారు.

తిరుగుబాట్లు ప్రపంచానికి ప్రమాదమే

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆఫ్ఘనిస్థాన్‌లో మొదలై ఇప్పుడు సిరియా దేశంతో సహా జరుగుతున్న తిరుగుబాట్లు ఆయా దేశాల ప్రజలకే కాదు ప్రపంచానికీ ప్రమాదకరమేనని విశ్లేషకులు అచ్యుత ఇందుశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఆయా దేశాల్లో తిరుగుబాట్లు - కారణాలు - పర్యవసానాలు' అనే అంశంపై శనివారం జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు.

కాపు భవన్‌కు నిధుల మంజూరుపై హర్షం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కాపు భవన్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు మంజూరు చేయడంపై కాపు జేఏసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక మారుతీనగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం కాపు జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడిగా జనసేన నాయకులు చందనపు నాగరాజును ఎనుకున్నారు.

తెలంగాణ సీఎం వ్యాఖ్యలు సిగ్గుచేటు

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ మాదిగ డే -2024 సమావేశానికి హాజరైన తెలంగాణ సీఎం ఎటువంటి సంబంధం లేని అంశమైన ఎస్సీ వర్గీకరణను ప్రస్తావిస్తూ తెలంగాణలో ఏక సభ్య కమిషన్‌ను వేశామని, నివేదిక అందాక చర్యలు తీసుకుంటామని చెప్పడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరు శివారులోని నల్లపాడులో ఆదివారం జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు మేరకు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కృష్ణనగర్, స్తంభాలగరువు, పట్టాభిపురం ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టే రోడ్ల నిర్మాణం డ్రెయిన్ టు డ్రెయిన్ చేయాలని, డ్రెయిన్ల లెవెల్ సరిగా ఉండేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. డ్రెయిన్లపై నిర్మించే కల్వర్టుల వద్ద మురుగుపారుదల సక్రమంగా ఉండడంలేదని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం అనంతరం డెబ్రిస్‌ని తొలగించాలని, సచివాలయాల వారీగా ఎక్కడైనా రోడ్ల ప్యాచ్ వర్క్ చేయాలని గుర్తిస్తే ఎప్పటికప్పుడు చేపట్టాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ నుండి ఎన్టీఆర్ స్టేడియం వరకు రోడ్లకు ఇరు వైపులా డ్రెయిన్ నిర్మాణం చేయాలని, ఆక్రమణదారులకు నోటీసులు అందించి స్వచ్ఛందంగా వాటిని తొలగించాలని వారికి తెలియచేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పట్టాభిపురం మెయిన్ రోడ్ నుంచి డీఆర్‌ఎం ఆఫీస్ వరకు రోడ్డు, డ్రెయిన్, శ్యామలానగర్ గేటు నుంచి డీఆర్‌ఎం ఆఫీస్ వైపు డ్రెయిన్ నిర్మాణం కోసం ప్రజల నుండి పలు అర్జీలు అందుతున్నాయని, తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పట్టాభిపురం లోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌ని పరిశీలించి, మరమ్మతులపై నివేదిక ఇవ్వాలని ఈఈని ఆదేశించారు. అనంతరం తుఫాన్‌నగర్ రోడ్డులోని క్రైస్తవ శ్మశానవాటికను పరిశీలించారు. సీసీరోడ్డు వేయా లని, బోరింగ్ పంపు మరమ్మతు చేయాలని, గేటు ఏర్పాటు చేసి, జంగిల్ క్లియర్ చేయాలని డీఈఈని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ ఈ.వరప్రసాద్, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, డీఈఈ మధుసూదన్, శ్రీనివాసరావు, ఏసీపీ రెహ్మాన్, ఆర్‌ఓ బాలాజీ బాషా, ఏఎంహెచ్‌ఓ ఆనందకుమార్, టీపీఎస్ సత్యనారాయణ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్ పూల్‌ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రణాళిక అంశాలపై అర్జీలు, ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి శుక్రవారం జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ప్లానర్ చాంబర్‌లో ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యలపై ఫోరంలో అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని చెప్పారు. నగర ప్రజలు, లైసెన్స్ ఇంజినీర్లు, తమ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఫోరంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు రెహ్మాన్, వెంకటేశ్వర్లు, టీపీఎస్ సత్యనారాయణ, టీపీబీఓలు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

5 నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

గుంటూరు(విద్య),డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడ లోని పీఆర్ డిగ్రీ కళాశాలలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో కీలక భూమిక పోషించడం, ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి నికరంగా పనిచేయడం వల్ల ప్రజల, ఉపాధ్యాయుల,ఉద్యోగుల మద్దతును యూటీఎఫ్ పొందిందని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులను, సాహితీవేత్తలను, విద్యారంగ ప్రముఖులు, మహిళా నాయకులను ఆహ్వా నిస్తున్నామని తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణలో రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమ కుమారి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యూ రాజశేఖరరావు, ఎం కళాధర్, జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వరరావు, షకీలా బేగం, శ్రీనివాసరావు, రంగారావు, శ్రీనివాస్ కార్తీక్, బాజీబాబా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవిపై ఆరోపణలను ఖండించిన ఇస్కాన్



ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి హిందూ ధర్మాన్ని కించపరిచినట్లు వస్తున్న ఆరోపణల్లో ఎంతమాత్రం నిజం లేదని, ఆ ఆరోపణలను ఖండిస్తున్నామని ఇస్కాన్ ప్రతినిధి విలాస విగ్రహదాస్ తెలిపారు. తాడేపల్లి కుంచనపల్లిలోని 'హరే కృష్ణ గోకుల క్షేత్రంలో శనివారం జరిగిన లక్ష్మీనరసింహస్వామి హోమానికి హాజరైన ఎమ్మెల్యే, రాధాకృష్ణులవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచితంగా భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మాధవి, విలాస విగ్రహ దాస్ విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం కొంతమంది భక్తులు ఢిల్లీ నుంచి వచ్చి భగవద్గీత పుస్తకాలను విక్రయిస్తున్నారని ఇస్కాన్ ప్రతినిధి విగ్రహదాస్ చెప్పారు. ఆ క్రమంలో కొంత సమన్వయ లోపం జరిగిందని, వారు కొంత ఉత్సాహంతో ద్విచక్రవాహనాలు, కార్లు ఆపి విక్రయిస్తున్న విషయం కూడా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. భగవద్గీత చాలా పవిత్రమైంది కనుక, దానిని రోడ్డు మీద కాకుండా సముచిత స్థానం ఏర్పాటు చేసి విక్రయిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే మాధవి వారికి సూచించారని ఆయన చెప్పారు. అయితే, వారు ఇతర రాష్ట్ర వాసులు కావడం, అందులోనూ యువకులు కావడంతో కొంత ఉద్వేగానికి లోనై ఎమ్మెల్యే ఆలోచనను అర్థం చేసుకోలేకపోయారని వివరించారు. ఎమ్మెల్యే మాధవి ఆది నుంచి ఇస్కాన్‌కు ఎంతో అండగా నిలుస్తూ వస్తున్నారన్నారు. అలాంటి ఆమె సనాతన ధర్మాన్ని అడ్డుకున్నారని చేస్తున్న ప్రచారాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసింహస్వామి యజ్ఞంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ పూర్ణాహుతి కార్యక్రమానికి ఇస్కాన్ పెద్దలు తనను ఆహ్వా నించారని, కార్యక్రమంలో పాల్గొని భక్తులందరికీ భగవద్గీతలను అందించే అదృష్టం కలిగిందని ,అనంతశేష గుడి నిర్మాణ ప్రతిష్ఠా కార్యక్రమంలో కూడా తాను పాల్గొన్నట్లు చెప్పారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల పుట్టినరోజు వేడుకలు

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుడిగా ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిక్షణం ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పనిచేశారని తెలుగు తమ్ముళ్ల అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ధూళిపాళ్ల పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా మాష్టారు మాట్లాడుతూ ధూళిపాళ్ల నరేంద్ర తన ముప్పై ఏళ్ల రాజకీయ జీవితంలో అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. వైసీపీ పాలనలో జగన్ రెడ్డి సంగండైరీని కబ్జా చేయాలనే దురుద్దేశంతో నరేంద్రపై అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేసినా ఎప్పుడు వెనకడుగు వేయలేదన్నారు. మద్దిరాల ఇమ్మానుయేల్ మాట్లాడుతూ నరేంద్ర తన రాజకీయ జీవితం ద్వారా రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. సంగం డెయిరీని 2 వేల కోట్ల టర్నోవర్‌కు చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, మానుకొండ శివప్రసాద్, కనుకుర్తి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, పాసెం నవీన్, మద్దిరాల గంగాధర్, ఈరంటి వరప్రసాద్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, బొబ్బిలి రామారావు, వడ్రాణం హరి బాబు, దయారత్నం, సుశీలరావు, కొల్లి అనిల్ పాల్గొన్నారు.

సోషల్‌మీడియా సైకోల భరతం పట్టే చట్టం

గుంటూరు సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా సైకోల భరతం పట్టడానికి కొత్త చట్టాన్ని రూపొందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. గుంటూరులో శనివారం ఆయన మాట్లాడుతూ తమకు నచ్చని వారిపై ఇష్టారాజ్యంగా అసభ్యకర, అనుచిత పోస్టులు పెడుతున్నారని దీనివలన అనేకమంది ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారికి ఈ చట్టం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు. సీఐడీబీటీ రంగాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సముచితంగా ఉందని, దీనివల్ల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

కార్యకర్తలకు గౌరవం దక్కేది బీజేపీలోనే: శనక్కాయల అరుణ

గుంటూరుసిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు జీవిత కాలం గుర్తుండి పోయే గౌరవం దక్కేది బీజేపీలోనే అని మాజీ మంత్రి శనక్కాయల అరుణ అన్నారు. గుంటూరు పశ్చిమ అసెంబ్లీ ఒకటవ మండలంలోని పదకొండు బూత్ అధ్యక్ష ఎన్నికల కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ స్థాయిలోని అధ్యక్ష ఎన్నిక కూడా పారదర్శకంగా చేపట్టే బీజేపీలోనే ప్రజాస్వామ్యం బతికి ఉందని అన్నారు. అనంతరం బీజేపీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ రవికుమార్ మాట్లాడారు. బూత్ అధ్యక్షుడు కోలవెన్ను శ్రీనివాసరావు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది.

హరిదాసులను కళాకారుల జాబితాలో చేర్చాలి



తిరుప్పాణ్ ఆళ్వార్ శోభాయాత్రలో హరిదాసులు

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుప్పాణ్ ఆళ్వార్ తిరునక్షత్రం (జయంతి) సందర్భంగా నిత్యదాస సంప్రదాయ అనుయాయులు స్థానిక కలెక్టరేట్ రోడ్డు నుంచి జీటీ రోడ్డు వరకు శోభాయాత్రను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హరిదాసు వ్యవస్థను కూడా కళాకారుల జాబితాలో చేర్చాలని కోరారు. తమ సంప్రదాయానికి, చరిత్రకు తగిన విధంగా తమ వర్గాన్ని గెజిట్‌లో 'నిత్యదాసులు' పేరుతో మార్చిరాయాలని కోరారు.

ఆడిటర్ శ్రీనివాసరావుకు బెస్ట్ జోనల్ చైర్మన్‌గా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ ఆడిటర్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు గుజరాత్‌లోని జునాగడ్‌లో జరిగిన సమావేశంలో జాతీయ స్థాయిలో బెస్ట్ జోనల్ చైర్మన్‌గా శనివారం ఆయన అవార్డు అందుకున్నారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సమావేశంలో ఈ అవార్డును అందుకున్నారు.

హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం



ఎంపీ అంబికా జీ లక్ష్మీనారాయణ వాల్మీకిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గుంటూరు(విద్య),డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): స్థానిక హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో వివిధ సంవత్సరాలలో చదువుకున్న దాదాపుగా 400 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారందరికీ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థులను అతిథులుగా ఆహ్వానించి వారిని సత్కరించారు. ముఖ్య అతిథిగా హిందూపూర్ పార్లమెంట్ సభ్యుడు అంబికా జి లక్ష్మీనారాయణ వాల్మీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదుగుదలకు హిందూ కళాశాల అధ్యాపకులు యాజమాన్యం ఎంతో దోహదపడిందని అన్నారు. సామాజిక స్పృహ కలిగి ఉండి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఉన్నతాధికారి డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, విజువల్ ఆర్టిస్ట్ ఆదర్శ బాజీ, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ టీ నాగేశ్వరరావు , డాక్టర్ డి నాగేశ్వరరావు, డాక్టర్ ఏ సుబ్రహ్మణ్యం, కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి నివేదికను కేవీఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ వై గౌరీశంకర్, జూపూడి రంగరాజు పాల్గొన్నారు.

కరాటేలో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థినికి గోల్డ్ మెడల్



విద్యార్థినికి గోల్డ్ మెడల్ అందజేస్తున్న డాక్టర్ సీ హేమంత్, సెక్రెటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 22వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ - 2024, షీటో రియోకై ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ ఇండియా గుంటూరులోని ఈ నెల 8న గుంటూరులో నిర్వహించిన కరాటే పోటీల్లో పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య (సీబీఎస్‌ఈ)పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న ఎం.లక్ష్మీ సుమేధ అండర్-12 బాలికల కటా విభాగంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుందని పాఠశాల పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో ప్రఖ్యాత జనరల్ ఫిజిషియన్ గా సేవలు అందిస్తున్న డాక్టర్ సీ హేమంత్ తెలిపారు. **22వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ - 2024, షీటో రియోకై ఇంటర్నేషనల్ కరాటే అకాడమి ఇండియా ఆధ్వర్యంలో** స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించింది.ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ ఈ పాఠశాల లోనే తాను ఎన్నో అవార్డులను గెలుపొందానని, నేడు ఇదే పాఠశాల లోని చిన్నారికి తన చేతులమీదుగా బంగారు పతకం అందజేయడం తనకు గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ కరాటే ఆడపిల్లలకు ఆత్మరక్షణే కాకుండా శారీరక ,మానసిక దృఢత్వానికి దోహదకారి అని అన్నారు. ఈ సందర్భంగా కోచ్ కే సురేష్ ని ప్రశంసించారు. బంగారు పతకం సాధించిన లక్ష్మీ సుమేధను పాఠశాల పాలవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాద రావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ , ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతి దేవి, కోఆర్డినేటర్స్ దుర్గాశ్యామ్, శ్రీదేవి అభినందించారు.

హాకథాన్‌లో విజ్ఞాన్ నిరుల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పాతూరి రాధిక తదితరులు

గుంటూరు(విద్య),డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత బహుళ జాతి సంస్థ అమెజాన్ నిర్వహించిన హాకథాన్ సంభవ్ -2024లో విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్‌సీ తృతీయ సంవత్సరం విద్యార్థిని ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థిని మాద జ్యోతి సాయి ప్రియ రెండవ రన్నర్ అప్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ హాకథాన్‌లో క్రాస్ బోర్డర్ నియంత్రణ, మార్కెట్ విశ్లేషణ, ఇ - కామర్స్ వ్యాపారులకు సరళీకృత ఆర్థిక మద్దతు అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం తదితర అంశాలపై జ్యోతి సాయి ప్రియ తన బృందం సమర్పించిన ప్రాజెక్టుకు రెండు లక్షల నగదు బహుమతి లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి సాయిప్రియను విజ్ఞాన్ అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవ రాయలు, డాక్టర్ వీ లక్ష్మణ్ నారాయణ అభినందించారు.



రోగి మహమ్మద్‌తో వైద్యులు రమణ ఎస్ఎస్‌వీ, కిరణ్‌కుమార్

అరుదైన శస్త్రచికిత్సతో ఫ్రెనిక్ నరాల కణితి తొలగింపు

గుంటూరు మెడికల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అరుదైనరీతిలో ఫ్రెనిక్ నరాలపై ఏర్పడిన కణితితో బాధపడుతున్న రోగికి గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో అత్యంత నైపుణ్యంతో శస్త్ర చికిత్స చేసి దానిని తొలగించారు. శనివారం సర్జరీ వార్డులో జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌వీ తెలిపారు. యనమదలకు చెందిన మహమ్మద్ అనే రోగి మెడ ఎడమ భాగంలో కణితి ఏర్పడటంతో చికిత్స కోసం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చేరాడు. ఇది వేగస్ నరంపై ఏర్పడిన షానోమాగా (కణితి) భావించిన వైద్యులు మహమ్మద్‌కు శస్త్రచికిత్స నిర్వహించారు. రోగికి ఆపరేషన్ చేస్తున్న క్రమంలో కణితి వేగస్ నరం నుంచి కాకుండా అరుదైన రీతిలో ఫ్రెనిక్ నరాలపై ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. ఫ్రెనిక్ నరాలు శ్వాసక్రియలో కీలకపాత్ర పోషించడంతో పాటు ఉదరంలో విభాజక పటలం (డయాఫ్రమ్) సంకోచ వ్యాకోచాలను నియంత్రిస్తుంది. కణితి తొలగించే క్రమంలో సూది మొన పొరబాటు జరిగినా రోగి శ్వాసక్రియకు ఇబ్బందులు ఏర్పడి ప్రాణాపాయం కలుగుతుంది. దీనిని సవాల్‌గా భావించిన వైద్యులు శస్త్రచికిత్స కొనసాగించారు. సర్జరీ సమయంలో కణితిని ఫ్రోజెన్ సెక్షన్‌కు పంపించి, పెథాలజీ వైద్యులు కేన్సర్‌గా మారలేదని చెప్పడంతో కణితి మొత్తం తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ శనివారం మాటాడుతూ రూ.6 లక్షల విలువైన ఈ సర్జరీని ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కింద ఉచితంగా చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ చేసిన జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఫ్రెనిక్ నర్వ్ ట్యూమర్‌ను తొలగించడం జీజీహెచ్ చరిత్రలో ఇదే మొదటిసారని తెలిపారు.



అలంకరణలో మహాపడి పూజా మహోత్సవం

ఏలూరుబజారులో వైభవంగా మహా పడిపూజ

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక లాలాపేట ఏలూరుబజారులో శనివారం సాయంత్రం అయ్యప్పస్వామి నవదశ (19వ) మహా పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 9.47 గంటలకు అష్టాద్రవ్య మహాగణపతి హోమం శంకరమంచి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పద్మనాభన్ నంబూద్రి గురుస్వామిచే 18 రకాల ద్రవ్యాలు, నదీ జలాలతో మహా అభిషేకాలు శాస్త్రోక్తంగా చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో పాటు వివిధ రకాల పూలతో వేదికను సరికొత్తగా తీర్చిదిద్దారు. కేరళ సంప్రదాయంలో 18 రకాల పూలతో మహాపడి పూజా మహోత్సవం కనులపండు వగా జరిగింది. ఈ సందర్భంగా డప్పు శ్రీను బృందం సభ్యులు ఆలపించిన అయ్యప్పస్వామి పాటలు భక్తులను భక్తి పారవశ్యంలో ఓలలాడించాయి. 'స్వామియే శరణం అయ్యప్ప' శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. అయ్యప్పస్వామిని వారిని పలువురు ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహా పడి పూజ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అన్న సంతర్పణ చేయనున్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు గ్రంథె నాగవెంకట మల్లేశ్వరరావు, తడికమళ్ళ మణికంఠ, నాళం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి తదితరులు

వాహన చోరీల నిందితుడు అరెస్టు

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వాహన చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేసి, పదకొండు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గుంటగ్రౌండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. నిందితుడు పెరికల సాగర్‌ను ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు పిడుగురాళ్ళలోని లెనిన్ నగర్‌కు చెందిన సాగర్ కొంత కాలంగా గుంటూరులోని శ్రీనివాసరావుతోట పరిధిలోని విజయలక్ష్మి థియేటర్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. ద్విచక్ర వాహన దొంగతనాలకు అలవాటు పడ్డాడు. స్థానిక కొత్తపేట, పాతగుంటూరు, లాలాపేట, ఖమ్మం 3 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన చోరీలకు పాల్పడ్డాడు. కొంతకాలంగా నగరంలో జరుగుతున్న వరుస దొంగతనాలపై పోలీసులు దృష్టిసారించారు. ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురు రోడ్డులో సాగర్ అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా అతన్ని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య


గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం స్థానికఅశోక్‌నగర్‌లో జరిగింది. కేసు వివరాల ప్రకారం, జూట్ మిల్ ప్రాంతానికి చెందిన వేమవరపు రాంబాబు (35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బుల కోసం భార్యను వేధిస్తుండేవాడు. ఎప్పటిలాగే శనివారం మధ్యాహ్నం కూడా డబ్బులు కోసం భార్యను వేధించాడు. ఆమె డబ్బులు ఇవ్వలేదు. దీంతో,అశోక్‌నగర్‌లో ఉన్న తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళాడు. అక్కడ రేకుల షెడ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యాపారి అదృశ్యం



శంకరరావు (ఫైల్)


స్థానిక లాలాపేట స్టేషన్ పరిధిలోని రొట్టెల బజార్‌కు చెందిన పులుగమూటు శంకరరావు (61) అదృశ్యమయ్యాడు. శంకర రావు వేరుశనగలు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తుండే వాడు. కిడ్నీ ఇన్ఫెక్షన్ వల్ల ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో వారిని ఏమరిచేలా చేసి ఇంటి నుండి వెళ్లిన ఆయన తిరిగిరాలేదు. శంకరరావు ఆచూకీ తెలిసి వారు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.




కోటయ్య స్వామి ఆలయం

రేపు కోటప్పకొండలో ఆరుద్రోత్సవం

- విశేష అభిషేకాలకు విస్తృత ఏర్పాట్లు
- తరలిరానున్న మేధాదక్షిణామూర్తి మాలధారణ స్వాములు



శ్రీ మేధా దక్షిణామూర్తి



శ్రీ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామికి ఆరుద్రోత్సవం 16న సోమవారం వైభవంగా జరగనున్నది. ఇందుకోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నది. కోటయ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో మేధా దక్షిణామూర్తి మాలధారణ స్వాములు ఆరుద్రోత్సవానికి తరలిరానున్నారు. అయ్యప్ప స్వామి తరహాలో కోటప్పకొండ శ్రీమేధాదక్షిణామూర్తి మండల దీక్ష భక్తులు చేపడతారు. ఆరుద్రోత్సవానికి హాజరై స్వాములు ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు భక్తులు జ్యోతి దర్శనం చేసుకుంటారు. అనంతరం శ్రీత్రికోటేశ్వరస్వామికి మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకం నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శ్రీత్రికోటేశ్వరస్వామిని మేధా దక్షిణామూర్తిగా కూడా భక్తులు కొలుస్తారు. కోటి వరాల దీక్ష కోటప్పకొండ దీక్ష అనే సంకల్పంతో మేధా దక్షిణామూర్తి మాలను భక్తులు ధరిస్తారు. కోటప్పకొండలో 1981 నుంచి కోటయ్య స్వామి మాలధారణ ప్రారంభమైంది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు కోటప్పమాలను ధరించి 41 రోజులు మండల దీక్షను భక్తిశ్రద్ధలతో చేపడతారు. అర్ధ మండల దీక్షతో పాటు 11 రోజుల మాలధారణ కూడా స్వాములు చేపడతారు. కోటి వేల్పుల అండ కోటప్పకొండ అని భక్తులు విశ్వసిస్తారు. అయ్యప్ప స్వాముల వలె కోటయ్య మాల ధరించిన స్వాములు ఇరుముడితో కోటప్పకొండ చేరుకుంటారు. ఆరుద్రోత్సవం సందర్భంగా కోటయ్య స్వామికి స్వాములు ఇరుముడి సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇరుముడిని స్వాములు తలపై ధరించి నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి కొందరు పాదయాత్రగా కోటప్పకొండ చేరుకుంటారు. కోటప్పకొండలో జరగనున్న ఆరుద్రోత్సవం సందర్భంగా లింగంగుంట్ల శివాలయంలో మాలధారణ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కోటప్పకొండలో ఆరుద్రోత్సవం సందర్భంగా జరిగే అభిషేకాలకు విశిష్టత నెలకొంది. స్వామికి వివిధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. జ్యోతి దర్శనం అనంతరం త్రికోటేశ్వరస్వామికి మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం జరగనుంది. వీభూది, గంధం, కుంకుమ, పంచదార, వివిధ రకాల ఫలాలు, ఎండు ఫలాలు, ఆవు నెయ్యి, పెరుగు, తేనె, పాలు తదితర ద్రవ్యాలతో స్వామికి ఘనంగా అభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి స్వామికి అన్నాభిషేకం చేస్తారు. అర్ధరాత్రి నుంచి తెల్లవార్లు ఆలయంలో మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు ఘనంగా జరగనున్నాయి. అభిషేకాల అనంతరం స్వాములు మాలాధారణలు విరమిస్తారు. మంగళవారం ఉదయం యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్రహోమాలు నిర్వహిస్తారు. మేధాదక్షణామూర్తి స్వాములకు ప్రసాదం, భోజన సౌకర్యాలు ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. ఆరుద్రోత్సవం ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. ఆరుద్రోత్సవ అభిషేకాలను పురస్కరించుకుని మంగళవారం ఉదయం స్వామికి అభిషేకాలు జరగవని ఈవో తెలిపారు.



అనుసంధాన రహదారి మార్గాలను డ్రోన్ సాయంతో పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

అమరావతి నుంచి హైవేకి రోడ్ల అనుసంధానం

మంత్రి పీ నారాయణ

మంగళగిరి సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలోని సీడ్ క్యాపిటల్ నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ రోడ్లను నిర్మించనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ నారాయణ తెలిపారు. రాజధాని ప్రాంతంలో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మంగళగిరి వద్ద 16వ జాతీయ రహదారికి అనుసంధానం చేసే ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లు నిర్మించే ప్రాంతాలు, పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో రాజధాని నిర్మించాలని సీఎం చంద్రబాబు పూనుకుంటే రైతులు కేవలం 58 రోజుల్లోనే స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాట ఆడి అమరావతిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి నిర్మాణానికి గత ప్రభుత్వం రద్దు చేసిన జీవోలను పునరుద్ధరించి, అన్ని ఇబ్బందులను అధిగమించి రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేసిందని చెప్పారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో వంటి సంస్థలు రాజధాని అమరావతి నిర్మాణానికి రుణ సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే రూ.22వేల కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించిందని, తదుపరి సీఆర్డీఏ సమావేశంలో మరో రూ.20 వేల కోట్ల పనులకు అథారిటీ నుంచి ఆమోదం తీసుకుంటామని వివరించారు. అమరావతి క్యాపిటల్ సిటీ 217 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి వుందని, ఇందులో తూర్పు నుంచి పడమర వరకు 16 రోడ్లు వుండగా, ఉత్తరం నుంచి దక్షిణం వరకు 18 రోడ్లు వున్నాయని తెలిపారు. ఈ రోడ్లను జాతీయ రహదారితో అనుసంధానం చేయాల్సి వుందన్నారు. తొలి దశలో ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లను అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ-11లో 39 ఎకరాలు, ఈ-13లో 21 ఎకరాలు అటవీ భూమి వున్నట్టు గుర్తించామన్నారు. ఈ-13లో 23 ఇళ్లు, ఈ-11లో 85 ఇళ్లు, ఈ-15లో 65 ఇళ్లు వున్నట్టు గుర్తించామని, వాటిలో ఎక్కువ శాతం ప్రభుత్వ భూముల్లో వున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. ఈ-11 రహదారి ఎయిమ్స్ సర్వీస్ రోడ్డు వద్ద ఆర్ అండ్ బీ రహదారికి కలుస్తుందని, ఈ-13 రహదారి డీజీపీ కార్యాలయం పక్కగా కలుస్తుందని వివరించారు. ఆరు లేన్లుగా నిర్మించబోయే ఈ రహదార్లలో 80 నుంచి వంద కిలోమీటర్ల మేర వేగంతో వాహనాలు వెళ్లే అవకాశం వుంటుందన్నారు. అతి తక్కువ భూసేకరణ, నష్ట నివారణ జరిగేలా ఈ రహదార్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. దీనికి సంబంధించి లీ కన్సల్టెన్సీకి డీపీఆర్ రూపకల్పన పనులను అప్పగించామని, వారు 90 శాతం అధ్యయనం పూర్తి చేశారని, మరో పదిరోజుల్లో పూర్తి నివేదిక వస్తుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



మ్యాపును పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న మంత్రి నారాయణ



వెంకటపాలెం వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం దేవస్థానంలో రైతులు, మహిళలతో జ్యోతిర్మయి

అమరావతి రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయటం శుభపరిణామం

- అన్నం పెట్టే రైతు భగవంతుడితో సమానం
- వేంకటేశ్వరుడే అమరావతిలో ఉన్నాడు.. అభివృద్ధి పనులు ఆగవు
- సంగీత విధ్వాంసురాలు జ్యోతిర్మయి కొండవీటి

తుళ్లూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) అమరావతి రైతులపై పెట్టిన అక్రమ కేసులు కూటమి ప్రభుత్వం ఎత్తివేయటం శుభపరిణామమని ప్రముఖ సంగీత విధ్వాంసురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. శనివారం రైతులు, మహిళలతో కలసి వెంకటపాలెం టీటీడీ వేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ, అన్నం పెట్టే రైతు భగవంతునితో సమానమన్నారు. అటువంటి రైతుపై అక్రమ కేసులు గత వైసీపీ ప్రభుత్వం పెట్టటం దారుణమైన అంశమన్నారు. ముఖ్యంగా మహిళల మీద పెట్టడం దుర్మార్గమన్నారు. ఉద్యమ సమయంలో రైతుల పరామర్శ, ధైర్యం చెప్పటం కోసం పలుమార్లు అమరావతిలో పర్యటించానని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటంతో రైతులు గుండెల మీద చేయివేసుకొని హాయిగా నిద్రపోవచ్చన్నారు. మొదట రాష్ట్ర రాజధాని అమరావతే అని చెప్పిన జగన్‌రెడ్డి అధికారం చేపట్టాక మూడు రాజధానులని మాట తప్పటం రైతులను మోసం చేయటమేనన్నారు. భగవంతుడు రైతు రూపంలో ఉన్నాడని వారికి హాని చేయటం అంటే దేవుడిని మోసగించటమేనన్నారు. అందుకే ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎంచుకున్నారన్నారు. అమరావతి అభివృద్ధి శరవేగంగా జరగాలని వేంకటేశ్వరుడిని కోరుకున్నట్టు చెప్పారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచారం వారు తోడ్పాటును అందిస్తే రాష్ట్రం మొత్తం హిందూ మతాన్ని.. ధర్మాన్ని ప్రచారం చేయటం కోసం చాలామంది ముందుకొస్తారన్నారు. ఆ దిశగా టీటీడీ బోర్డు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. అన్యమతం వారికి హైందవ ధర్మం పట్ల, వేంకటేశ్వరస్వామి పట్ల ఆసక్తి ఉండదని, అటువంటి వారిని టీటీడీ నుంచి తొలగించి వేరే విధులు కేటాయించటమే మేలని జ్యోతిర్మయి పేర్కొన్నారు. ఏ హిందూ దేవాలయాల్లోనైనా అన్యమతస్థులు విధులలో ఉండటం మంచి పరిణామం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. భగవంతుని మీద, హిందూ ధర్మం మీద నమ్మకం ఉన్న వారే ఆలయాల్లో ఉద్యోగ బాధ్యతల్లో ఉండాలనేది ప్రజలందరి కోరికన్నారు. కూటమి ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరుతున్నానని జ్యోతిర్మయి పేర్కొన్నారు. అమరావతి రైతులపై పెట్టిన అక్రమ కేసులు ప్రభుత్వం ఎత్తివేయటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఈ సందర్భంగా జ్యోతిర్మయి ధన్యవాదాలు తెలిపారు.



ఎయిమ్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన మంగళగిరి ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవానికి విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ పిలుపునిచ్చారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఎయిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాట్లను శనివారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్రపతి ఎయిమ్స్‌ను చేరుకునే ప్రవేశ ద్వారం నుంచి బస చేసే ప్రాంతం, ఆడిటోరియం, స్నాతకోత్సవం కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆహూతులందరూ ఉదయం పది గంటల లోపు ఆశీనులయ్యే విధంగా ఎయిమ్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో వుంచాలని, వాహనాల పార్కింగ్, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా వుండాలని తెలిపారు. రాష్ట్రపతితోపాటు రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు, ఇతర ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, ఐఎస్‌డబ్ల్యూ అధికారి ఆరిఫ్ హాఫీజ్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, డీఎంహెచ్‌వో కే.విజయలక్ష్మీ, డీఎస్‌వో పీ.కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచితమన్నా.. దోపిడీనే

(5వ పేజీ తరువాయి)

నిర్మాణదారులు పడిన అవస్థలు చూసిన ఇసుక వ్యాపార వస్తువు కాదని, దానిని ఉచితంగానే అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. మాటిచ్చినట్లుగానే ఇసుకను ఉచితం చేశారు. పోతకూలీల వంటి నామమాత్రపు ఖర్చులు మినహా అదనంగా వసూలు చేయకుండా తక్కువకు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇసుక బయటకు తరలించి, లారీలకు నింపినందుకు అయ్యే ఖర్చులు మాత్రం తీసుకోవాలని, ఎక్కడికక్కడ చార్జీలు నిర్ణయించారు. గతంలో ఇసుక తవ్వకాలకు జీఎస్టీ, సీఎస్టీ, సీనరేజ్ వంటి పన్నుల భారం ఇసుకపై ఉండేది. ఆ కొద్ది మొత్తం కూడా సామాన్యులకు భారం కాకూడదని కూటమి ప్రభుత్వం పన్నులు ఎత్తేసింది. కేవలం నది నుంచి ఒడ్డుకు కూలీలతో పోయించి బయటకు తీసుకొచ్చి, లారీలకు లోడ్ చేసినందుకు టన్నుకు నామమాత్రపు మొత్తాన్ని తీసుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. క్షేత్రస్థాయిలో ఇసుక విషయంలో ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడంలేదు. పైగా ఎక్కడికక్కడ అధికారులు నిర్ణయించిన రవాణా చార్జీలకు మించి కొన్ని రెట్లు అదనంగా వసూలు చేస్తుండడం అక్రమార్కుల దోపిడీకి నిదర్శనం. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కూడా కాంట్రాక్టర్‌లే దోచేస్తున్నారు. దీంతో సామాన్యుడికి ఒరిగేది తక్కువే అయినా, ఆదాయం విషయంలోనూ ప్రభుత్వానికి నష్టమే జరుగుతోంది. సముద్ర తీరంలోని బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని పొలాల్లో ఇసుక తవ్వి అమ్మేస్తున్నారు. దీనికి సీనరేజ్ కానీ, పన్నులు కానీ ఏమీ లేవు. అనుమతులు అసలే లేవు. అయినా తవ్వకాలు మాత్రం పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా సాగుతున్నాయి. తాజాగా జరిగిన కలెక్టర్ల సదస్సులోనూ ఇసుక విషయంలో ఖచ్చితంగా వ్యవహరించాలని, సామాన్యుడికి తక్కువ రేటుకు ఇసుక అందాలని, దీనికి అందరి సహకారం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. అయినా క్షేత్రస్థాయిలో మార్పులేదు.

ప్రభుత్వం మారినా.. తగ్గేదేలేదు

రాజధాని అమరావతి గ్రామాల్లో ఇసుక మఫియా చెలరేగిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణానది నుంచి ఏవిధంగా ఇసుకను తరలించుకుపోయారో.. అంతకు ఏమాత్రం తగ్గకుండా ఇప్పుడు కూడా తరలించుకుపోతున్నారు. మాజీ ఎంపీ నందిగం సురేశ్ స్వగ్రామమైన ఉద్దండరాయునిపాలెం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఉద్దండరాయుడిపాలెంలో ప్రధాని మోదీ అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రాంతానికి కూత వేటు దూరంలో కూటమి ప్రభుత్వ పాలనలో ఈ దందా జరుగుతుండడం విశేషం. గతంలో అడ్డుకున్న స్థానికులపై అధికారాన్ని ఉపయోగించుకుని ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి బెదిరించి అక్రమాలకు పాల్పడిన నందిగం అనుచరులు ఇప్పటికీ అదే పందాలో దందా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మాజీ ఎంపీ జైలుపాలైనా ఆయన అనుచరులు తగ్గడంలేదు. అందుబాటులో ఉన్న ఇసుకను స్థానికులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోవచ్చన్న అవకాశాన్ని ఆసరా చేసుకుని పట్టపగలే దర్జాగా ఇసుకను తరలించుకుపోతున్నారు. నది నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలించి, సమీపంలో డంప్ చేసుకుని రాత్రిళ్లు లారీల్లోకి లోడింగ్ చేసి తరలిస్తున్నారు. అధికారులు కూడా అటువైపు చూడకపోవడం విశేషం.

కేసులున్నా.. ఆగని అక్రమాలు

వైసీపీ హయాంలోనే ఇక్కడి ఇసుక తవ్వకాలపై గ్రీన్‌ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. సుప్రీంకోర్టు కూడా తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా.. ఆ సంస్థ అక్రమాలు ఆగలేదు. పైగా గ్రీన్‌ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నా సదరు సంస్థ ఇసుక తవ్వకాలను ఆపలేడంలేదని తెలుస్తోంది. ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కృష్ణా నదిని పూర్తిగా తవ్వేశారు. ఈ సంస్థ వెనుక వైసీపీ ముఖ్య నేతలు ఉండడంతో గ్రీన్‌ట్రిబ్యునల్ ఆశ్రయించిన వ్యక్తిని కూడా అక్రమ కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పెట్టారన్న విమర్శలున్నాయి. ఇలాంటి సంస్థపై కేసులు నమోదైన తర్వాత ఏమి చర్యలు తీసుకున్నారన్నది బహిర్గతం కావాల్సి ఉంది.



టీటీడీ బోర్డు సభ్యురాలు జానకీ దేవికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న టీటీడీ బోర్డు సభ్యురాలు

తుళ్లూరు, డిసెంబరు 14: (ఆంధ్రజ్యోత) మండల పరిధిలోని అనంతవరం వేంకటేశ్వర స్వామిని శనివారం టీటీడీ బోర్డు సభ్యురాలు జానకీ దేవీ దర్శించుకున్నారు. వేద పండితులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్ల మార్గం పనులు త్వరగా పూర్తి చేయాలని టీటీడీ సిబ్బందికి సూచించారు. అన్నదాన భవనం, కల్యాణ కట్టకు షెడ్లు నిర్మించాలని రైతులు, గ్రామస్తులు జానకీ దేవీకి వినతి పత్రం సమర్పించారు. అభివృద్ధి పనుల గురించి చైర్మన్‌కు తెలియజేస్తామని ఆమె రైతులకు తెలిపారు. పలువురు బీజేపీ నేతలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాజధాని రైతుల కేసులు పరిష్కారం



కోర్టుకు విచ్చేసిన రాజధాని రైతులు

మంగళగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో రాజధాని రైతులపై పెట్టిన కేసులలో 30 కేసులు పరిష్కారమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రాజధాని రైతులపై అనేక కేసులు నమోదు చేయడంతో రాజధాని మహిళా రైతులు సైతం నేటికీ కోర్టుల చుట్టూ తిరగాల్సివస్తోంది. ప్రభుత్వం మారిన తరువాత కేసులు ఎత్తివేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలోనే హామీ ఇచ్చారు. తదనుగుణంగా శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో 30 కేసులు పరిష్కారమయ్యాయి. కోర్టు ప్రాంగణం రాజధాని రైతులు, కక్షిదారులతో కిటకిటలాడింది. ఈ కేసుల పరిష్కారంలో లోకేశ్ చూపిన చొరవ పట్ల రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి జాతీయస్థాయి సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు

- ఏపీ బాలురు, బాలికల జట్లు ఎంపిక

ద్రాక్షారామం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నేటి నుంచి జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్ పోటీలకు ఏపీ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఈనెల 1 నుంచి 14 వరకు సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ కోచింగ్ క్యాంపు శాప్ పర్యవేక్షణలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి రామచంద్రపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో నిర్వహించిన పోటీల నుంచి ఎంపిక చేసిన 18 మంది క్రీడాకారుల నుంచి సబ్ జూనియర్స్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల ఏపీ జట్టును ఎంపిక చేసినట్టు శాప్ కోచ్ ఎస్.సంతోష్‌కుమార్ తెలిపారు. అదే విధంగా పశ్చిమ గోదావరి జిల్లా ఉల్లంపర్రు, మాంటిస్సోరి పాఠశాలలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 14 వరకు బాలికల జాతీయ బాస్కెట్‌బాల్ కోచింగ్ నిర్వహించినట్టు శాప్ కోచ్ పి.జగదీష్ తెలిపారు. జాతీయస్థాయి బాస్కెట్ బాల్ సబ్ జూనియర్ బాలికల పోటీలో పాల్గొనే ఏపీ బాలికల జట్టును ఎంపిక చేసినట్టు తెలిపారు. శిక్షణ పర్యవేక్షించిన బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తి ఎంపికైన బాలురు, బాలికల జట్లు, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

బాలుర జట్టు: ఎస్.శ్రీసాయి చరణ్, వై.సుశ్రిత్, కె.ప్రణీత్, టి.గౌతమ్(తూర్పుగోదావరి), ఇ.చార్లెస్ వెస్లీ(పశ్చిమగోదావరి), జి.జగదీష్, ఎ.మనోఅభిరామ్ (కృష్ణాజిల్లా), పి.జీవన్, బి.ఉజ్వల ఈశ్వర్‌సాయి, ఎం.సంతోష్(అనంతపురం), బి.ఎస్.కార్తీకేయ(విశాఖ), బి.సత్యేంద్ర(గుంటూరు) ఎంపికయ్యారు. స్టాండ్ బై క్రీడాకారులుగా వి.కిరణ్(తూర్పుగోదావరి), వి.వహివాట్సన్(విశాఖ), వి.హర్షిత్(గుంటూరు) ఎంపిక చేశారు.

బాలికల జట్టు: సీహెచ్ ఐశ్వర్యాంబిక, బి.సాలిని రత్న మాధురి, సీహెచ్ భువనేశ్వరి, డి.హాసిని(తూర్పుగోదావరిజిల్లా), బి.కుసుమ, బి.వర్షిణి, ఆర్.వర్షిణి(కృష్ణా), కె.ఆముక్త, వై.హిమవర్షిణి(విశాఖ), టి.అంజలి, ఎస్.జాస్మిన్(చిత్తూరు), ఏవీఎల్ అక్షయ(గుంటూరు) ఎంపిక చేశారు. స్టాండ్ బై క్రీడాకారిణిలుగా పి.శాంతి, డి.శంకరి(తూర్పుగోదావరి), ఎస్.ఎస్.ఎన్.ఎస్. ఆకర్షలను ఎంపిక చేసినట్టు కోచ్ పి.జగదీష్ తెలిపారు.



సబ్ జూనియర్ జాతీయస్థాయి ఏపీ బాలికల జట్టు

నేడు, రేపు రాష్ట్ర స్థాయి బాల బాలికల రగ్బీ పోటీలు

ఫిరంగిపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని డాక్టర్ రంజన్ బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో అండర్-15 బాల, బాలికల రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ఈనెల 15, 16 తేదీల్లో జరుగుతాయని పల్నాడు రగ్బీ అసోసియేషన్ సెక్రటరీ డానియేలు, ఆర్‌సీజేసీ కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సుదర్శన్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, రగ్బీ అసోసియేషన్‌ల సభ్యులు పాల్గొంటారని వారు తెలిపారు.

ఉండవల్లి శ్రీదేవిని కలిసిన ఎమ్మెల్యే సౌమ్య



శ్రీదేవికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

తాడేపల్లి టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని కలిశారు. చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టడంతో సౌమ్య ఆమెను కలిసి అభినందించారు. పలు అంశాలపై ఇరువురు కొద్దిసేపు భేటీ అయ్యారు. అనంతరం ఎమ్మెల్యే సౌమ్యను శ్రీదేవి సత్కరించారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్

తాడేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని జెఎస్‌ఎం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. రైతులు, స్థానికుల ఇబ్బందులు గమనించి జెఎస్‌ఎం అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు హరిజన వాడ కరకట్ట ప్రాంతం, సాయినగర్ నుంచి కరకట్ట వర్క్‌షాప్ వెంట ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్లపొదలను తొలగించారు. జెఎస్‌ఎం అమ్మ ఫౌండేషన్ సేవలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మాలల మహాగర్జనను జయప్రదం చేయాలి

మంగళగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ నల్లపాడులో ఆదివారం సాయంత్రం జరుగనున్న మాలల మహాగర్జనను జయప్రదం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, వైస్ చైర్మన్ గుర్రం రామారావు పిలుపునిచ్చారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్ క్లబ్‌లో శనివారం మహాగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే ఎన్నో సమస్యలు వస్తాయని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరారు. ముందుగా కులగణన చేసి, ఆ తర్వాత జనాభా, ఉపాధి అవకాశాలను పరిశీలించి వర్గీకరణ చేయాల్సిన అవసరం వస్తే తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అశోక్‌కుమార్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో జూదరుల అరెస్టు

తాడేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉండవల్లిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో శ్మశాన ప్రాంతం వద్ద పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆరుగురు కోడి పందేలరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13 వేల నగదు, ఒక పుంజును స్వాధీనపరచుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

తాడేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న దీక్షలు శనివారంతో 11వ రోజుకు చేరుకున్నాయి. కార్మికుల దీక్షలను యూనియన్ నేత కూరపాటి స్టీవెన్, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కొర్రపాటి కోటేశ్వరరావు ప్రారంభించారు. శనివారం నాటి దీక్షల్లో ఎండీ ఇస్మాయెల్, దర్శి అబ్రహం, డేరంగుల రమణ, దర్శి పాల్, కంచర్ల సీత కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, అంకయ్య, ఆదినారాయణ, ఆశీర్వాదం, సూర్య ప్రకాష్, బాషా, ఇమాంబి, రమాదేవి, దుర్గాభవాని, శారమ్మ, రమణ, బుజ్జి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవాలు

● చినజీయర్ స్వామి పర్యవేక్షణలో పూజలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి బైపాస్ రోడ్డు వెంట ఉన్న బాపూజీ విద్యాలయం ఆవరణలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు నెల రోజులపాటు ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు వైటీఆర్ ట్రస్టు చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్ తెలిపారు. బాపూజీ విద్యాలయంలో శనివారం లైలా గ్రూప్స్ చైర్మన్ గోకరాజు గంగరాజుతో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. అమరావతి రాజధాని త్వరితగతిన అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఈ ధనుర్మాస వ్రత మహోత్సవా లను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని, ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తోపాటు పలువురు ప్రముఖులు ఉత్సవాలకు హాజరవుతారన్నారు. నెల రోజులపాటు జరిగే ఈ మహోత్సవాల్లో ప్రతిరోజు 15 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తారన్నారు. ఈ సమావేశంలో క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి సదిమేల శ్రీకూర్మనాథస్వామి, సీతానగరం జీయర్ ఆశ్రమ ప్రతినిధులు పురాణం వెంకటాచార్యులు, మధుసూదనాచార్యులు, సదిమేల రఘునాథ్, విశ్రాంత డీఐజీ వెంకటస్వామి, ఆకురాతి శంకరరావు, లక్ష్మీ, వికాస తరంగిణి ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ హవా

● ఐదు సంఘాలు ఏకగ్రీవం

● యనమదల వెస్ట్ ట్యాంక్ సంఘానికి ఎన్నికలు

మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఛానల్ ఆయకట్టు ప్రాంతానికి సంబంధించిన నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు శనివారం మంగళగిరి మండలం ఆత్మకూరు జడ్పీ హైస్కూల్లో జరిగాయి. ఇప్పటం, ఆత్మకూరు, పెదవడ్లపూడి, చినకాకాని రైతులు కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇప్పటంకి చెందిన సాధు కొండలరావు, ఉపాధ్యక్షుడిగా ఆత్మకూరుకు చెందిన జాలాది రత్నకుమార్, సభ్యులుగా బెల్లకొండ శ్రీనివాసరావు, గడ్డిపాటి సాంబశివరావు, జవ్వాది హనుమంతరావు, తమ్మిశెట్టి రమణయ్య, మొసలి లీలాకృష్ణ, తాతా వెంకట కృష్ణారావు, బడే రామారావు, ఒంటెద్దు రామచంద్రయ్య, ఒంటెద్దు అంజనేయులు, ఏడుకొండలు ఎన్నికయ్యారు.

చినకాకాని-1 సంఘం అధ్యక్షుడిగా మాణిక్యాల రవి, ఉపాధ్యక్షుడిగా ఆలూరి ఉమామహేశ్వరరావు, చినకాకాని-2.. సుంకర రామారావు, శివకుమారి, గుండిమెడ.. మేడూరి ధనలక్ష్మి, గుండిమెడ చినపాములు, పెదకొండూరు.. పాలెం బాజీబాబు, భీమిరెడ్డి శివశంకర్‌రెడ్డి, చినపాలెం.. విసరపు శేషగిరి, సంపతి శివనాగేశ్వరరావు, పేరుకలపూడి.. గోగం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ముద్రబోయిన రామయ్య, ఈమని.. మాగం వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా గండికోట నారాయణ, దుగ్గిరాల.. గౌరునేని అనిల్‌కుమార్, గాజులవర్తి మరియమ్మ, పెదవడ్లపూడి.. నాగళ్ల రామకృష్ణ, అప్పికట్ల శివబాబు, తుమ్మపూడి.. నర్రా శివప్రసాద్, మరీదు శివనాగేశ్వరరావు, కేఆర్‌కొండూరు.. తాడిబోయిన నాగేశ్వరరావు, ఉలవకట్టు శివశంకర్‌రావు, చిలువూరు.. ఆలపాటి రామారావు, కనపర్తి రాజాసింగ్, పెనుమూలి.. కొరిటాల భాస్కర్, తాళ్లూరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరితోపాటు ఒక్కో సంఘానికి మొత్తం 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గుంటూరు ఛానల్ ఇరిగేషన్ అధికారులతోపాటు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తాటి వెంకట్రావు, నేతలు కొమ్మా సుకుమార్, శానం మాణిక్యరావు, పిచ్చియ్య, తాతా కోటయ్య, సంగెపు శివరామకృష్ణ, జాలాది రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో జరిగిన ఆరు నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ విజయభేరి మోగించింది. ఐదు సంఘాలు ఏకగ్రీవం కాగా యనమదల వెస్ట్ ట్యాంక్ సంఘానికి ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ సంఘానికి తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన మంతనాలు ఫలించక పోవడంతో ఎన్నికలు అనివార్యమైంది. మొత్తానికి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరిగాయి. వంగిపురం 1వ సంఘానికి అధ్యక్షురాలిగా ఇక్కుర్తి కోమలి (జనసేన), ఉపాధ్యక్షులుగా మెట్టు సాంబశివరావు(టీడీపీ) ఎంపికయ్యారు. అలాగే వంగిపురం 2వ సంఘానికి అధ్యక్షుడిగా కోటపాటి సదాశివరావు, ఉపాధ్యక్షుడిగా పోలూరి వీరారెడ్డి, పాతమల్లాయపాలెం.. కల్లూరి కుసుమ, కొర్రపాటి బుల్లియ్య, పెదగొట్టిపాడు.. గుంటుపల్లి దేవయ్య లుముంబా, యనమదల.. పసుపులేటి పోలురాజు, రెడ్డి వెంకటేశ్వర్లు, యనమదల వెస్ట్ ట్యాంకు అధ్యక్షుడిగా యడ్లపల్లి హరిబాబు, ఉపాధ్యక్షుడిగా కఠారి గోవిందు ఎన్నికయ్యారు. అన్ని సంఘాల్లో ఎన్నికలు ఏకగ్రీవం కావడానికి మండల నాయకులు కొన్ని రోజులుగా గట్టి ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో గెలుపొందిన టీసీ మెంబర్లందరికీ వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అయితే యనమదలలో జరిగిన ఎన్నికలకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ నాగేంద్రలు బందోబస్తు నిర్వహించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూశారు. కాగా గుంటూరు రూరల్ మండలానికి సంబంధించి చౌడవరం నీటి సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా కోయవారిపాలెం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు అయినంపూడి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వట్టిచెరుకూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పదవులను అలంకార ప్రాయంగా చూడకుండా రైతుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలు నిర్వహించాలని మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెద రత్తయ్య, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. మండలంలోని నీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా టీడీపీ అభ్యర్థులు కైవసం చేసుకోవటం హర్షణీయమని మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు హర్షం వ్యక్తం చేశారు. చమళ్ళమూడి - 1వ టీసీకి ఆలా సాంబశివరావు, చమళ్ళమూడికి -2కు ఆరికపూడి ప్రసాదు, గారపాడుకు ఉప్పుటూరి తిరుపతిరావు, పల్లపాడుకు కొర్రపాటి శంకరరావు, కుర్నూతలకు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, ముట్లూరుకు ఐనంపూడి కోటయ్య చౌదరి, కారెంపూడి పాడుకు కోడె సుబ్బారావులు అధ్యక్షులుగా అధికార ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు. ఎన్నికల సందర్భంగా మండలంలోని వట్టిచెరుకూరు సీఐ రమానాయక్, ఎస్‌ఐ సుబ్బారావు బందోబస్తును పర్యవేక్షించారు.



పేరుకలపూడి నీటిసంఘాల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులతో మండల అధ్యక్షురాలు శ్రీఅనిత, ఎంపీటీసీ అశోక్



నూతనంగా ఎన్నికైన గుంటూరు ఛానల్ ఆయకట్టు ప్రాంత నీటి సంఘం ప్రతినిధులు


పెదనందిపాడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నవర్రు, కట్రపాడు గ్రామాలలో నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కట్రపాడు 12 టీసీలు ఏకగ్రీవం కాగా అధ్యక్షుడిగా రామినేని చంద్రశేఖర్ సాయిబాబు, ఉపాధ్యక్షుడిగా బండారు రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్నవర్రు 12 టీసీలకు ఐదు టీసీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడు టీసీలకు అభ్యర్థులు పోటీలో నిలవగా, 11వ టీసీలో అభ్యర్థి నామినేషన్ పత్రం సరిగా లేకపోవడంతో తిరస్కరణకు గురి కావడంతో కొల్లా సుబ్బరామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదు టీసీలకు ఎన్నికల అధికారి లక్ష్మీదేవి ఎన్నికలు నిర్వహించారు. గెలుపొందిన అభ్యర్థులకు నియామకపత్రం అందజేశారు. అనంతరం 12 టీసీలు కలిసి జెట్టి సీతమ్మను అధ్యక్షురాలిగా ఎన్నుకోగా, కొల్లా శివబసవపున్నయ్యను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

మేడికొండూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలో నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన వారు టీసీలకు ఎన్నికయ్యారు. వైసీపీకి చెందిన వారు ఎవరూ కూడా పోటీకి ముందుకు రాకపోవడంతో మండల పరిధిలో జరిగిన ఐదు సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. 106 మేడికొండూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా నెలకుదిటి రాఘవరావు, ఉపాధ్యక్షుడిగా తవ్వగుంట సలీమ్, 144 సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా మదమంచి శ్రీనివాసరావు(పేరేచర్ల), ఉపాధ్యక్షుడిగా గొర్రె సుబ్బారావు(విశదల), 132 సంఘం అధ్యక్షుడిగా పాములపాటి వాసుదేవరావు(మేడికొండూరు), ఉపాధ్యక్షుడిగా యంగ్రపల్లి మహాలక్ష్మి (డోకిపర్రు), 107 సాగునీటి సంఘం అధ్యక్షుడిగా జంపని నరశింహారావు(సిరిపురం), ఉపాధ్యక్షుడిగా పేరం శివకృష్ణారావు(పాలడుగు), 108 సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మన్నెపల్లి శ్రీనివాసరావు(వరగాని), ఉపాధ్యక్షుడిగా కంకణాల హరిబాబు(సిరిపురం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో టీసీలకు కూడా ఎన్నిక ఏకగ్రీవం అయింది.



సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

ఫిరంగిపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పది నీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో తొమ్మిది నీటి సంఘాలు ఏకగ్రీవంగా కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. కొండవీడుకు చెందిన నీటి సంఘం ఎన్నిక ఇంకా పూర్తి కాలేదని అధికారులు తెలిపారు. రేపూడి నీటి సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఆరే పున్నారెడ్డి, వల్లెరు జోజప్ప, నుదురుపాడుకు తియ్య గూర శాయి ప్రసాదరెడ్డి, కొల్లి వెంకటరెడ్డి, ఫిరంగిపురంనకు గణేషుని కోటేశ్వరరావు, బొందలపాటి నాగేశ్వరరావు, 104 నుదురు పాడు సంఘానికి వేల్పూరి బాజీ, నార్నె శ్రీనివాసరావు, తక్కెళ్ళపాడుకు ఇందూరి పుల్లారెడ్డి, మాదాసు శ్రీనివాసరావు, తాళ్ళూరు సంఘానికి అంచుల శంకరరావు, మల్లవరపు రాయన్న, మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌కు వేల్పు ల అంకారావు, కంచర్ల శ్రీనివాసరావు ఉరఫ్ బుజ్జి, పొనుగుపాడుకు రాయంకుల చంద్రమౌళి, మస్తాన్ వలి, బేతపూడికి నల్లజర్ల రవికుమార్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా తెలగనేని శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అధికారులు తెలిపారు. టీడీపీ మండల కార్యాలయంలో జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ నీటి సంఘాల నాయకులుగా అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం గెలిచిన అభ్య ర్థులంతా నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసిం హారావు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కారెంపూడిపాడులో అధ్యక్షుడు కోడె సుబ్బారావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

తాడికొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తాడికొండ మండల పరిధిలోని నీటి సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. నీటి సంఘం ఎన్నికల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాడికొండ మండల పరిధిలో తాడికొండ, పొన్నెకల్లు-1, పొన్నెకల్లు-2, బండారుపల్లి, బేజాత్‌పురం, పాములపాడు, దామరపల్లి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్ నీటి సంఘం అధ్యక్షుల వివరాలను ప్రకటించారు. తాడికొండ టీడీపీ సీనియర్ నాయకుడు ఎడ్వూరి హనుమంతరావు ఆధ్వర్యంలో గ్రామంలోని అక్కదేవత చెరువు నీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. తాడికొండ నీటి సంఘం అధ్యక్షుడిగా గోగినేని పుల్లారావు, ఉపాధ్యక్షుడిగా పాటిబండ్ల ప్రసాద్, ధూళిపాళ్ల వెంకటరత్నంను ఎనుకున్నారు. పొన్నెకల్లు-1లో అధ్యక్షుడిగా గుంటుపల్లి మధుసూదనరావు, ఉపాధ్యక్షుడిగా దామినేని శివరామ్ ప్రసాద్‌లను, పొన్నెకల్లు-2లో అధ్యక్షుడిగా గర్నెడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కాలారి అప్పారావులను ఎన్నుకున్నారు. బండారుపల్లి నీటిసంఘం అధ్యక్షుడిగా చాగంటి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కొల్లా నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. బేజాత్‌పురం నీటి సంఘానికి మేకల పున్నారావును అధ్యక్షుడిగా, చిట్టూరి వెంకటరత్నంను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. పాములపాడు నీటి సంఘానికి అధ్యక్షుడిగా కాట్రగడ్డ విజయ్ భాస్కర్‌ను, ఉపాధ్యక్షుడిగా దామచర్ల ప్రసాద్‌ను, దామరపల్లి అధ్యక్షుడిగా గొంది లక్ష్మీనారాయణను, ఉపాధ్యక్షుడిగా గుడిపాటి లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు.

తుళ్లూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెదపరిమి గ్రామానికి చెందిన రెండు నీటి సంఘాల కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. నియామక పత్రాలను తుళ్లూరు తహసీల్దార్ సుజాత అందజేశారు. 151వ నెంబరు కెనాల్‌కు నూతన అధ్యక్షుడిగా రాయపాటి హరిబాబు, ఉపాధ్యక్షుడిగా పోతుగుంట్ల చంద్రశేఖరావు, మరో పది మంది డైరెక్టర్లుగా నియమితులయ్యారు. 152వ నెంబరు అధ్యక్షుడిగా మోదుగుల రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా తాడికొండ శివశంకర్‌రావు, పది మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి తహసీల్దార్ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నూతలపాటి రామారావు, పుట్టి రామచంద్రరావు, కర్నాటి శ్రీనివాసరావు, భాష్యం చినశ్రీధర్, పెదశ్రీధర్, పోతుగుంట నర్సయ్య, డిప్యూటీ తహసీల్దార్‌లు సుభాష్, వసంతరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తహసీల్దార్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న పెదపరిమి 151వ కెనాల్ నీటి సంఘం అధ్యక్షుడు హరిబాబు

గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చేస్తా

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చేస్తానని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం లాం శివారు తాతిరెడ్డి పాలెంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టి అభివృద్ధికి చిహ్నంగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానన్నారు. ఇక్కడ యువత రోజు వారి పనులు చేసుకునే వారు మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు బానిసలవకుండా డబ్బు కూడబెట్టుకొని భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. మౌలిక వసతులు ప్రతి గ్రామానికి కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే పెన్షన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దును ప్రభుత్వం అమలు చేసిందన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామరస్య ధోరణిలో కేసులు పరిష్కరించుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి అంజని ప్రియదర్శిని

మంగళగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు శాంతియుతంగా సామరస్య ధోరణిలో కేసులు పరిష్కరించుకోవాలని మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం అంజని ప్రియదర్శిని అన్నారు. మంగళగిరి కోర్టుల పరిధిలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ లోక్ అదాలత్‌లతో సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సీహెచ్‌వీ రామకృష్ణ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లలో కేసులు రాజీపడితే ఇరుపక్షాల వారు విజేతలేనన్నారు. అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కమ్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.సురేష్‌బాబు మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు ఎస్ ఆనందకుమార్, టీ రాజ్యలక్ష్మి, కే వెంకటస్వామి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

లోక్ అదాలత్‌లో 281 కేసుల పరిష్కారం

మంగళగిరి కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో 281 కేసులు పరిష్కారమయ్యాయి. అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కమ్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో 255 కేసులు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో 22 కేసులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 4 కేసులు పరిష్కారమయ్యాయి.

ఘనంగా ధూళిపాళ్ల జన్మదిన వేడుకలు



కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు, ప్రత్తిపాడు, బాపట్ల, తెనాలి, తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులు భారీసంఖ్యలో తరలివెళ్లి ఎమ్మెల్యే నరేంద్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ నాయకుడు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను చింతలపూడిలో నరేంద్రకుమార్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ వేడుకల్లో కల్లం రాజశేఖర్‌రెడ్డి, ఖాసిమ్ ఖాన్, పాటిబండ్ల వెంకటేశ్వరరావు, చిగురుపాటి రాజేష్, మేక అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

గుంటూరు(విద్య),డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభలు కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాలలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో కీలక భూమిక పోషించడం, ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి నికరంగా పనిచేయడం వల్ల ప్రజల, ఉపాధ్యాయుల, ఉద్యోగుల మద్దతును యూటీఎఫ్ పొందిందని తెలిపారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

● హాజరుకానున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్



పసుపు తోరణాలతో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ముస్తాబైన తుళ్లూరులోని లైబ్రరీ సెంటర్

తుళ్లూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో ఆదివారం జరిగే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు టీడీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామంలోని కొత్తూరు సెంటర్ నుంచి కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌లతో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు లైబ్రరీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తారని తాడికొండ నియోజకవర్గ ఆర్టీఎస్ టీడీపీ కోఆర్డినేటర్ నెలకుదిటి చంద్రశేఖర్(చందు), గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు శనివారం తెలిపారు. అనంతరం విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణకు ఎన్టీఆర్ అభిమానులు, సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


మంత్రి లోకేశ్‌ను కలిసిన బాలోత్సవం ప్రతినిధులు



మంత్రి లోకేశ్‌ను కలిసిన బాలోత్సవం ప్రతినిధులు

తాడేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ప్రతినిధులు శనివారం మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఎంటీఎంసీ బాలోత్సవం 3వ పిల్లల పండుగ ప్రారంభోత్సవానికి లోకేశ్‌ను ఆహ్వానించారు. తప్పకుండా వస్తానని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. లోకేశ్‌ను కలిసిన వారిలో రాష్ట్ర బాలోత్సవాల బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, ప్రతినిధులు జీఎస్‌ఆర్ మోహనరావు, రావూరి రమేష్‌బాబు, ఎస్.శ్రీనివాసరావు, ఎంటీఎంసీ బాలోత్సవ్ కోశాధికారి గాదె సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

కన్నుల పండువగా దత్త జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



లేమల్లెపాడులో దత్త పారాయణం చేస్తున్న భక్తులు

వట్టిచెరుకూరు, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మండల వ్యాప్తంగా గ్రామాల్లోని సాయినాధుని ఆలయాల్లో శనివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రధానంగా మండలంలోని లేమల్లెపాడు సాయినాధుని మందిరంలో దత్త జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మందిరం, ప్రాంగణం రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలమాలలతో శోభాయ మానంగా అలంకరించారు. శనివారం తెల్లవారు జామునే సాయి నాధుని స్మరణతో భక్తులు గ్రామ సంకీర్తన ఆలపించి అనంతరం మందిరంలో ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన సాయినాధుని విగ్రహానికి భక్తులు కుటుంబ సభ్యులతో పాలాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం భారీ అన్నదానం నిర్వహించారు. అలాగే అనంతవర ప్పాడు, చింతపల్లిపాడు, ముట్లూరు తదితర గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు.

గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

కొల్లిపర, డిసెంబరు 14 : మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొలకలూరు పంచాయతి ఇన్‌చార్జి

కార్యదర్శిగా జయదేవ్

తెనాలి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా పొన్నెకంటి జయదేవ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గతంలో ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన గుర్రం ప్రసాదరావు సాధారణ బదిలీల్లో భాగంగా పెదకాకానికి వెళ్లారు. ఆయన స్థానంలో జయదేవ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పంచాయతీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హీరో అల్లు అర్జున్

అరెస్టు సరికాదు

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ హీరో అల్లు అరెస్టు సరికాదని, ఆయనపట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరించిన తీరుని ఖండిస్తూ జిల్లా అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యాన్స్ అధ్యక్షుడు పెసర్లంక రమణ మాట్లాడుతూ, సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా వచ్చిన సమయంలో జరిగిన సంఘటనకు బాధ్యతగానే ఉండి ఆ కుటుంబానికి రూ.25 లక్షలు సాయం అందించారన్నారు. వేలాది మంది అభిమానులు ఉండే హీరో వచ్చినప్పుడు పోలీసులు, థియేటర్ యాజమాన్యం ఏర్పాట్లు చేయాల్సి ఉంటే హీరోని బాధ్యుడిని చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.

16 నుంచి దీక్షా మహోత్సవాలు

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీశరణాగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో దనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలు ఈ నెల 16న ప్రారంభం అవుతాయని నరేంద్ర రామానుజ దాసస్వామి తెలిపారు. ఉత్సవాల వివరాల పోస్టర్‌ను శనివారం ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి వీఎస్ఆర్ కళాశాల రోడ్డులో నిర్వహించే మహోత్సవాలు జనవరి 13 వరకు కొనసాగుతాయన్నారు. ఉత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు. విష్ణుమొలకల విజయలక్ష్మి, వాలేశ్వరరావు, శివయ్య, చిన్నమ్మాయి, పెనుగొండ వెంకటేశ్వరరావు, సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ

వృద్ధురాలి మృతి



తెనాలి రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురు ఎన్టీఆర్ సెంటర్ వద్ద ఈ నెల 12న గుర్తుతెలియని వృద్ధురాలిని ఆటో ఢీ కొట్టింది. దీంతో రక్తగాయాలైన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలికి చెందిన వివరాలు ఏమి లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. ఫోటోలోని వృద్ధురాలిని గుర్తించిన వారు రూరల్ ఎస్ఐ ఫోన్ నెంబర్లు 9440796170, 9492985472కి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

రౌడీషీటర్ వీరంగం

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్డులో వస్త్ర దుకాణంలో రౌడీషీటర్ వీరంగం సృష్టించాడు. బట్టలు కొనేందుకు వచ్చిన తలవరస విజయ్ కుమార్ అలియాస్ అబ్బు దుకాణ యజమానిపై రెచ్చిపోయి ప్రవర్తించాడు. మద్యం మత్తులో వ్యాపారి రమేష్‌కుమార్ జైన్‌పై దాడి చేశాడు. రహదారిపై ట్రాఫిక్ కోసం ఏర్పాటు చేసిన రాడ్ తెచ్చి కొట్టడంతో గాయపడిన వ్యాపారిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమయపాలన పాటించాలి

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మాసోత్సవాలలోనే కాకుండా నిరంతరం సమయపాలన పాటించాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు అన్నారు. తెనాలి ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను శనివారం సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించిన అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, దూర ప్రాంతాలు వెళ్లే బస్సు డ్రైవర్లు సమయపాలన పాటించాలన్నారు. గ్యారేజీకి చెందిన ఏసీ మెకానిక్ జోషిబాబు, అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్ కేఎస్ కృష్ణారావును సత్కరించి పారితోషికం అందించారు. డీపీటీవో రవికాంత్, డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ జయప్రసాదరావు పాల్గొన్నారు.

అన్నీ ఏకగ్రీవమే !

● ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు
● ఒక్కో స్థానానికి ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు
● లాంఛన ప్రాయంగానే ఎన్నిక



ఎన్నిక పత్రం అందుకుంటున్న సాగునీటి సంఘాల అధ్యక్షుడు శేషగిరిరావు

పొన్నూరుటౌన్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పది సాగు నీటి సంఘాలకు శనివారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయి. పది సంఘాల ఎన్నిక ఏకగ్రీవంగా సాగింది. ఈ ఎన్నికలో కేవలం ఒకో స్థానానికి ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. సాగు నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వరుసగా.. 309కి సుఖవాసి అప్పారావు, శ్యామలా రామమోహనరెడ్డి, 310కి వేజండ్ల చంద్రశేఖర్, షేక్ సుభానీ, 315కి సూరిశెట్టి రామయ్య, చిలంకూరి రామయ్య, 317కి బలగాని రామారావు, నున్నా సూర్యనారాయణ, 319కి మానుకొండ పెద్ద సుబ్బారావు, గుర్రం ధర్మారావు, 320కి గణిపిశెట్టి రామారావు, తరణి అంజయ్య, 321 ఉప్పల భాను ప్రసాద్, సంసోను, 322 అన్నవరపు హనుమాయమ్మ, షేక్ జానీ సైదా, 323కి ఊటుకూరి నరసింహారావు, ముప్పా రామారావు, 326కి బొద్దులూరి వెంకటేశ్వరరావు, బీ సాయిబాబు ఎన్నికయ్యారు.

సాగు నీటి సంఘాల ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓ ప్రభుత్వ శాఖ ఉద్యోగులు, ఒకో సంఘం వద్ద ఎన్నికల అధికారులుగా నియమించారు. ఎన్నికల ప్రక్రియను సాగు, డ్రైనేజ్ శాఖ అధికారులు పర్యవేక్షించారు. కాగా, సాగు నీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లను ఎన్నుకోనున్నారు.



తహసీల్దార్ కృష్ణ కాంత్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నంబూరు మురళీకృష్ణ రెడ్డి

చేబ్రోలు, (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని 8 సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైంది. మండల పరిధిలోని వేజండ్ల సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా గవిని రవీంద్ర, ఉపాధ్యక్షుడిగా మట్టుపల్లి చంద్రయ్య, గొడవర్రు సంఘానికి పసుపులేని శ్రీనివాసరావు, అన్నంమనేని వెంకట్రావు, అనంతరపాడు సంఘానికి మాదాల విష్ణు ప్రసాద్, శలపాడు సంఘానికి కంచర్ల శేషగిరి, ఎర్రాకుల శివగిరి, శేకూరు సంఘానికి మోర్ల చిట్టిబాబు, మంద్రు బాబురావు, వడ్లమూడి సంఘానికి దేవరపల్లి పవన్ కుమార్, జున్ను బుడే, చేబ్రోలు సంఘానికి సోమనపేరయ్య, అండే పార్థసారథి, పాత రెడ్డిపాలెం సంఘానికి పొదిలి ఏడుకొండలు, గమినీడి కృష్ణ ఎన్నికయ్యారు.

పెదకాకాని, 14(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలో నీటి సంఘాలు ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఈ మేరకు ఆయా నీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పలపాడు-1 దుద్దుకూరు భూష బాబు, తక్కెలపాడు-1 నూకవరపు రాజేష్. తక్కెళ్ళపాడు 2 అప్పసాని సాంబశివరావు, నంబూరు-1 ఏమని అప్పి రెడ్డి. హై లెవెల్ కెనాల్ ఎన్నికైన అధ్యక్షుల వివరాలు.. ఉప్పలపాడు- కాసుల హరిబాబు, నంబూరు- జొన్నల మురళీకృష్ణారెడ్డి.

ముగిసిన నీటి సంఘాల ఎన్నికలు



బొట్టా శ్రీరాములరెడ్డి



బోనం వెంకటరెడ్డి



కోటా వీరాంజనేయులు



తోట ఏడుకొండలు



సోమరాజు రవిప్రసాద్

కొల్లిపర మండలంలోని ఐదు సాగు నీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్షులు

తెనాలి రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండలంలోని 6 నీటి సంఘాలకు పెదరావూరు, కఠెవరం, కొలకలూరు గ్రామాల పరిధిలో ఆయా జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించగా మిగిలిన నేలపాడు-1, నేలపాడు-2, తెనాలి పరిధిలో పట్టణంలోని ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎమ్ హైస్కూల్లో నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయసంఘటనలకు తావులేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయి. నేలపాడు- 1కు నీటిసంఘాల అధ్యక్షుడిగా ఐనంపూడి వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసరావు, తెనాలి పరిధిలో అధ్యక్షుడిగా ఈదర శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌డీ ఆదాంషఫీ, నేలపాడు-2కి పెమ్మసాని శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రావు, పెదరావురుకి పాలడుగు ప్రసాంత్, కోడాలి సురేష్, కఠెవరంకి నాగంవెంకటేశ్వరరావు, ఏ.రమేష్‌బాబు, కొలకలూరుకి గడ్డె రత్తయ్య, బొద్దులూరి సుబ్బారావులు ఎన్నికయ్యారని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు.

కొల్లిపర, (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం ఐదు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహసీల్దార్ సిద్ధార్థ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వల్లభాపురం నీటి సంఘానికి అధ్యక్షుడిగా బొట్టా శ్రీరాములరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆరిగ పూర్ణచంద్రారెడ్డి, మున్నంగికి బోనం వెంకటరెడ్డి, జొన్నల నాగిరెడ్డి, కొల్లిపరకి కోటా వీరాంజనేయులు, కట్టా శ్రీహరిరెడ్డి, చివలూరుకి తోట ఏడుకొండలు, ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, అత్తోటకి సోమరాజు రవిప్రసాద్, మున్నంగి విజయభాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా తనతోపాటు ఎంపీడీవో విజయలక్ష్మి, ఏడీఏ ఉషారాణి, ఇరిగేషన్ ఏఈ శివాజీ, పీఆర్ ఏఈ అవుతు సాంబిరెడ్డి వ్యవహరించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భీమవరపు చినకోటిరెడ్డి, వంగా సాంబిరెడ్డి, బొమ్ము శివారెడ్డి, ఆళ్ళ సురేష్‌రెడ్డి, అడపాల నాగేశ్వరరావు, కొరారు అంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య నిర్దేశంతో చదవాలి

● రోటరీ గవర్నర్ శరత్ చౌదరి
● స్కూల్లో సైకిల్‌స్టాండ్, డైనింగ్ హాల్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శరత్ చౌదరి

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు జీవితంలో సాధించాల్సిన లక్ష్యాన్ని ఎంచుకుని అందుకోసం పట్టుదలతో కృషి చేయాలని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ సంయుక్తంగా బీజీఆర్ మైనింగ్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మించిన సైకిల్ స్టాండ్, డైనింగ్ హాలు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శరత్ చౌదరి మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను వారు ఆశించిన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. కంపెనీ ఫైనాన్షియల్ అధికారి, పాఠశాల పూర్వ విద్యార్థి చుండూరు విజయానంద్ మాట్లాడుతూ, చదువుకున్న పాఠశాలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టమన్నారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. పూర్వ విద్యార్థి విజయానంద్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన వివేకానందుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ క్లబ్ అధ్యక్షుడు వీ.బాలకోటిరెడ్డి, కార్యదర్శి మురళీకృష్ణ, హెచ్ఎం మౌలాలి, ఈదర వెంకటపూర్ణచంద్, అర్జున్, జీవీ నారాయణ, రాజేంద్రప్రసాద్, ఉపేంద్ర, కన్నెగంటి మురళీ, గుత్తా వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు

పౌష్టికాహారం అందించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లకు పౌష్టికాహారం అందించాలని, వసతి గృహాల స్థితిగతులను మెరుగు పరచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శనివారం తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతూ, హాస్టళ్ల కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తున్నా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందడం లేదని, వసతుల విషయంలో ఎలాంటి మార్పులు కనిపించడం లేదన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలే హాస్టల్స్‌లో ఉండి చదువుకుంటున్నారని, వారికి కంటికి రెప్పలా చూసుకోవాల్సిన వార్డెన్లు కొందరు అవినీతి అక్రమాలకు పాల్పడటం వలన లోపాలు తలెత్తుతున్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్టళ్లలో తగిన వసతులు కల్పిస్తే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు



మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ (పైన)

తెనాలి రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అన్నారు. శనివారం పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 25 అంశాలతో కూడిన అజెండాను సభ్యులు ఆమోదించారు. గ్రామాల్లో కుక్కలు, పందులు బెడద ఎక్కువగా ఉన్నాయని వాటిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని శస్త్రచికిత్సలకు వైద్యశాల అందుబాటులో లేకపోవడమే జాప్యానికి గల కారణమని ఈవోపీఆర్డీ వైవైడీ ప్రసాద్ సభ్యులకు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు కాళిశెట్టి ఫణికుమార్ కొలకలూరు గ్రామ పంచాయతీ కరెంటు బిల్లుదాదాపుగా రూ.2.50 కోట్లు పేరుకుపోయిందని అసలు పంచాయతీలో నిధులు ఏమవుతున్నాయి. పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని కార్మికులకుకూడా సకాలంలో జీతాలు ఇవ్వడంలేదని ఆగ్రామంలో ఏం జరుగుతుందో మండలస్థాయి అధికారులైనా తెలుసుకుంటున్నారా అని ప్రశ్నించారు. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. మండల పరిషత్ సర్వసభ్యసమావేశానికి పలువురు సర్పంచ్‌లు, అధికారులు హాజరు కాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఎంపీపీ ముందు లెవనెత్తడంతో వచ్చే సమావేశాలకు ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా చూస్తామని రాని వారికి మెమోలు జారీ చేస్తామని తెలిపారు. గ్రామాల్లో విద్యాభ్యాసంపై ఎంఈవో లక్ష్మీనారాయణ వివరించారు. ఉపాధి హామి పథకంపై, మహిళల అభ్యున్నతికి డ్వాక్రాగ్రూపుల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, జగనన్న కాలనీలో హౌసింగ్ నిర్మాణాలు వంటి పలు అంశాలపై సభలో వివరించారు. అనంతరం ఈవోపీఆర్డీ మాట్లాడుతూ మండలంలోని 18 పంచాయతీల్లో స్వర్ణపంచాయతీ హౌస్ ట్యాక్స్ కింద సుమారు రూ. 2.38 కోట్లు వసూలు కావల్సి ఉందని దీనిపై దృష్టిపెట్టి త్వరితగతిన వసూలు చేయాలని అధికారులను సూచించారు. మండల ప్రజాపరిషత్ ఏవో ఆచంట శ్రీనివాసరావు పర్యవేక్షనలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీలు గోపిశెట్టి రమాదేవి, చెన్నుబోయిన శ్రీనివాసరావు, ముప్పవరపు సంధ్యారాణి, ఇసుకపల్లి సుందరరావు, మదిరభగత్‌సింగ్, షైలాబాను ప్రసాద్,దోసపాటి నాగదేవిక, పలువురు సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారులు నాగరాజా, శ్రీధర్, అబ్దుల్ షరీఫ్, రాజశేఖర్

లోక్ అదాలత్‌లో

315 కేసులు పరిష్కారం

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టు ప్రాంగణంలో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు కేసులను పరిశీలించారు. రెండవ అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్‌లు సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులు పరిశీలించారు. 315 కేసుల పరిష్కారం కాగా, రూ.కోటి 84 లక్షల 85 వేలు బాధితులకు ఇప్పించారు. క్రిమినల్ కేసులు 274, సివిల్ 39, ప్రీలిటిగేషన్ కేసులు 2 పరిష్కరించిన వాటిలో ఉన్నాయి. అదాలత్ సభ్యులు రాజ్యలక్ష్మి, ప్రభావతి, దయాకిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ పలువురు న్యాయవాదులు అదాలత్‌లో పాల్గొన్నారు.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి వీ జ్యోత్స్నశ్రీ

రాజీమార్గమే రాజ మార్గం

● న్యాయాధికారి వీ జ్యోత్స్నశ్రీ
● లోక్ అదాలత్‌లో 82 కేసులు పరిష్కారం

పొన్నూరుటౌన్, డిసెంబరు14: కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజ మార్గమనని ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ గుంటూరు 3వ అదనపు సివిల్ జడ్జి వీ జ్యోత్స్నశ్రీ తెలిపారు. స్థానిక సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 82 కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయాధికారి జ్యోత్స్నశ్రీ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. 4 సివిల్ కేసులు, 3 మనోవర్తి కేసులు, 64 క్రిమినల్ కేసులు, 11 సివిల్ లిటిగెంట్ కేసులు పరిష్కరించారు. అదాలత్‌లో సభ్యులు షేక్ బాజి సహెబ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొందుగుల జయరాజ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

జేఎంజే కళాశాలలో

నాక్ బృందం పర్యటన

● విద్యా ప్రమాణాల పట్ల నాక్ బృందం సంతృప్తి

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జెఎంజె మహిళా కళాశాల విద్యా ప్రమాణాల పట్ల నాక్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కళాశాలను రెండు రోజుల పాటు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ టీమ్ సభ్యులు ప్రొఫెసర్ గాదంకి ఇందిర, ప్రొఫెసర్ బ్రిందా, ప్రొఫెసర్ సెబాస్టియన్‌లు కళాశాలలోని ల్యాబ్‌లు, తరగతి గదులు, రిజిస్టర్లు, భోజన వసతి, విద్యాబోధన, రికార్డులు పరిశీలించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని కరస్పాండెంట్ థెరిసమ్మకు అందజేశారు. ప్రిన్సిపల్ షైనీ, కో-ఆర్డినేటర్ అరుణ, పాటిబండ్ల హేమలత పాల్గొన్నారు.



నాక్ సర్టిఫికెట్ అందజేస్తున్న బృందం సభ్యులు



గుంటూరు, ప్రత్తిపాడు, బాపట్ల, తెనాలి, తాడికొండ, మంగళగిరి, నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లి ఎమ్మెల్యే నరేంద్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ నాయకులు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను చింతలపూడిలో ఎమ్మెల్యే నరేంద్ర కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ వేడుకల్లో కల్లం రాజశేఖర్ రెడ్డి, ఖాసిమ్ ఖాన్, పాటిబండ్ల వెంకటేశ్వరరావు, చిగురుపాటి రాజేష్, మేక అరవింద్ తదితరులు పాల్గొన్నారు. - పొన్నూరు టౌన్

రైతుల పక్షపాతి నరేంద్రకుమార్

● గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి



నరేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న వీరవల్లిమురళి, నాగభూషణం తదితరులు

తెనాలిరూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతిగా వారి అభ్యున్నతికి పాటుబడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారని, ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని అంగలకుదురు గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంలు ఆకాక్షించారు. శనివారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆవులరాజు, వెలగారమణ, గణేష్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రెపికా, పక్కన వెంకటశేషగిరిరావు, సుబ్బారావు

150 మందికి కంటి పరీక్షలు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని కన్యాకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి హస్టల్ ప్రాంగణంలో శనివారం వాసవీ సేవా సమితీ సభ్యులు, శంకర్ కంటి ఆసుపత్రి వారు సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వాసవీ సేవా సమితీ అధ్యక్షుడు వరదా వెంకట శేషగిరిరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రెపికా 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేసి, వారిలో 50 మందికి నేత్ర చికిత్సల కోసం మంగళగిరికి పంపారు. గత నెల 10వ తేదిన నేత్ర చికిత్సలు నిర్వహించిన వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ల జోళ్లను, మందులను అందించారు. కార్యక్రమంలో సేవా సమితీ కార్యదర్శి పెండేల సుబ్బారావు, కోశాధికారి సేతుమాదవరావు, వెంకట సుధీర్, శంకర్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కుసుమ కుమారి జయంతి

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లోని కుసుమ హరనాథ్ మందిరంలో శనివారం మాతా కుసుమ కుమారి 154వ జమంతి వేడుకలను మందిర కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి బోగి పళ్ల పోసి కేక్‌ను కట్ చేసి భక్తులకు అందజేశారు. అత్తోట భజన బృందం వారు భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేసి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, సుజాత మెహనరావు, మందిర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పల శరణు ఘోష



మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ మండపం వద్ద అయ్యప్ప భక్తులు

తెనాలి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మార్కెట్ సెంటర్‌లో శనివారం రాత్రి అయ్యప్పల శరణుఘోషతో మార్మోగింది. 50 అడుగుల మేర భారీ మండపాన్ని ఏర్పాటు చేసి పడిపూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వాసవీ మణికంఠ సేవా సమితి, శ్రీదేవి స్వీట్స్ బూర్లగడ్డ రామకృష్ణ, గాదంశెట్టి శ్రీనివాస్, పద్మనాభుని కార్తీక్, గోనుగుంట్ల శ్రీనివాస్, వెచ్చా సత్యనారాయణ ఆధ్వర్యంలో అయ్యప్ప పూజా మహోత్సవం నిర్వహించారు. మచిలీపట్నం మండప నిర్మాణదారులు ఏర్పాటు చేసిన మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయ్యప్ప స్వాములు, భవానీలు, శివస్వాములు పెద్ద సంఖ్యలో హాజరై అయ్యప్ప భజనల్లో పాలు పంచుకున్నారు.



కేక్ కట్ చేస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో

ఎమ్మెల్యే నరేంద్రకుమార్ జన్మదిన వేడుకలు

పెదకాకాని, డిసెంబర్ 14(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ జీ సింహాచలం ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజానాయకుడు నరేంద్ర అని కొనియాడారు. దూర విద్యా కేంద్ర సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆరు పర్యాయాలు ఒకే నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన ఏకైన ప్రజాప్రతినిధి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయుకులు కొరటాల రవీంద్ర, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్, టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రాయవరపు హరీష్, ఉదయ్,మనోజ్ జేఎస్జీ హోమ్ నిర్వాహకురాలు సిస్టర్ రోజ్ రీనా తదితరులు పాల్గొన్నారు.